గెడా రంగారావు

షాజహాన్ ప్రేమ కథ

వసుంధర

"ఐ లవ్ యూ రియల్లీ రవీ!" అంది నీరజ.

రవి ఆమెవంక గంభీరంగా చూసి "నేనూ అంతే_ అందుకే ఈరోజు నా గురించిన భయంకర నిజం నీకు చెప్పేయదల్చుకున్నాను. . ." అన్నాడు.

భయంకర నిజం అన్న మాటకు నీరజ తడబడింది. ఆమెకు నోట మాటరాలేదు. రవి మళ్ళీ ప్రారంభించాడు. "నాకు తెలియదు_ఇలాంటి రోజొకటి మన జీవితంలో రానున్నదని. తెలిస్తే నా బ్రతుకు దారి ఇంకోలా ఉండేదేమో! నిన్ను చూసినపుడు నీ అందానికి చలించి పరిచయం చేసుకున్నాను. ఆ తర్వాత నీ ఆకర్షణకు లోనై నీ చుట్టూ తిరిగాను. కానీ అదంతా ప్రేమగా

మారిపోయి మనం పెళ్ళి చేసుకోవాలనుకుంటామని నే నప్పట్లో అనుకోలేదు.

కానీ నువ్వు లేనిదే నాకు ప్రపంచం లేదు. నేను పెళ్ళి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చాను. నువ్వు అంగీకరించావు కాబట్టి - ఇంక నిన్ను నేను నా కాబోయే భార్యగా భావించవలసి ఉంటుంది. కాబోయే భార్య దగ్గర నన్ను గురించి ఏ రహస్యాలూ ఉండడం నా కిష్టం లేదు. ఎంత భయంకరమైనదైనప్పటికీ నన్ను గురించిన నిజం నీకు చెప్పక తప్పదు. అందువల్ల మన వివాహం ఆగి పోయినా సరే!"

"ఏమిటా నిజం రవీ___" అంది నీరజ. కాని వినడాని కామెకు భయంగానే ఉంది.

రవి ఎలా చెప్పడమా అన్నట్లు ఒక్క క్షణం ఆగాడు. ఆ తర్వాత నెమ్మదిగా "షాజహాన్ పేరు విన్నావా ఎప్పుడైనా?" అన్నాడు.

"హిస్టరీలో వస్తుంది..."

"ఆ షాజహాన్ కాదు..."

"మరి?" అని ఆగిపోయింది నీరజ. హఠాత్తుగా షాజహాన్ గురించి ఆమెకు స్ఫురించింది.

షాజహాన్ ఆ నగరాన్ని గడగడలాడిస్తున్న వ్యక్తుల్లో ఒకడు. ఆరితేరిన స్మగ్లర్ గా పోలీసులతణ్ణి అభివర్ణిస్తూంటారు. ధనిక వర్గాల కతను సింహస్వప్నం. అతనికి పెద్ద ముఠా ఉన్నదనీ ఆ ముఠాలో ఉన్న క్రమశిక్షణ అపూర్వమనీ అందరూ చెప్పుకుంటూంటారు. తనను గురించిన భయంకర నిజమంటూ రవి షాజహాన్ ప్రసక్తి తీసుకు రావడం నీరజ నేదో అనుమానానికి గురిచేసింది.

"షాజహాన్ ఎవరో గుర్తొచ్చిందా?" అన్నాడు రవి.

"వచ్చింది. కానీ నీకూ షాజహాన్‌కీ ఏమిటిసంబంధం?" భయపడుతూనే అడిగింది నీరజ.

"షాజహాన్ నా బాస్. అతని అనుచరులలో నేనే ప్రథముణ్ణి..." అన్నాడు రవి.

రావాలనుకుంటున్న భయం నీరజ కళ్ళలోకి వచ్చేసింది. చెప్పాలనుకున్న మాటలుమాత్రం నోటికి రాలేదు. అలా కళ్ళప్పగించి నోరు తెరిచి రవి వంకే చూస్తూండి పోయిందామె.

"అవును నీరజా! నా పదిహేనో ఏట చిల్లర దొంగతనాలుచేసి బ్రతుకుతూండే నేను షాజహానుకు దొరికాను. షాజహాన్ నా తెలివితేటలకూ, చాకచక్యానికీ, సమర్థతకూ ముచ్చటపడి నాకు తను స్వయంగా శిక్షణ ఇచ్చాడు. అయిదేళ్ళలో నేను అతని అనుచరులందరిలోకీ ప్రప్రథముడి నయ్యాను.

ఇప్పుడు నాకు పాతికేళ్ళు. ఆ రకం జీవితం మొహం మొత్తింది. బ్యాంకులో నా పేరున చాలా డబ్బుంది. ఫ్లైడ్ నా వ్యాపారం ప్రారంభించి సాఫీ జీవితం గడపాలని ఉంది. నాలో ఈ రకం ఆలోచనలు తలెత్తడానికి నీ పరిచయంకూడా కొంత వరకూ కారణం. నువ్వునుమతిస్తే నా పాత జీవితానికి స్వస్తిచెప్పి కొత్త జీవితం ప్రారంభించాలనుంది..."

నీరజ రవి కళ్ళలోకి చూసి "నువ్వు నిజమే చెబుతున్నావని నమ్ముతున్నాను. నిన్ను పెళ్ళి చేసుకోవడానికి నాకేమీ అభ్యంతరంలేదు. నేను లక్షాధికారి కూతుర్నే కావచ్చు. కానీ నా తండ్రి సంపాదన కూడా న్యాయా

రితం కాదు. బ్లాక్ మార్కెట్ లో ఈయన పాత్రకూడా ఉంది.

ఆయన కుమార్తెగా, ఆయన డబ్బు ననుభవిస్తున్న వ్యక్తిగా ఆయనచేసే పాపాల్లో నాకూ భాగముంది. అందుకని నన్ను నేను స్వచ్ఛమైన మనిషిగా భావించడం లేదు. ఎటొచ్చీ మన వివాహం జరిగేక నువ్వు స్వచ్ఛమైన జీవితం నడపాలి. షాజహాన్ గురించి మరిచిపోవాలి. నేనూ మా నాన్న గురించి మరిచిపోతాను. నలుగురూ మెచ్చేవిధంగా న్యాయంగా బ్రతుకుదాం..." అంది.

రవి కళ్ళలోకి వెలుగు వచ్చింది. "షాజహాన్ నన్నాదుకున్న వ్యక్తి. నాలో వ్యక్తిత్వం నింపిన మనిషి. అతని పట్ల కృతజ్ఞత చూపడం నా బాధ్యత. అయినా ఇక మీదట వ్యక్తిగా అతన్ని గౌరవిస్తాను తప్పితే–అతని కార్యకలాపాల్లో పాల్గొనను. ఇది నా తుదినిర్ణయం. ఆ రకం జీవితంలో సుఖం లేదు, సంతృప్తి లేదు. నీ భావాలు తెలిసేక నీమీద ప్రేమ మరింత పెరిగింది. కానీ మీ నాన్న కూడా ఓ చిన్న షాజహానే అయినప్పటికీ—ఆయనకు సంఘంలో స్థానముంది. షాజహానికీ, అతని మనుషులకీ సమాజంలో స్థానం లేదు. అందువల్ల మన వివాహం కాస్త ఇబ్బంది కావచ్చు..." అన్నాడతను.

"ఆ విషయంలో నువ్వు బెంగ పెట్టుకోవద్దు. మా ఇంట్లో అందర్నీ పెళ్ళికి ఒప్పించగలను. అయినా పెళ్ళికి నీ గురించిన పూర్తి వివరాలు వాళ్ళందరికీ ఎందుకు చెప్పాలి? నువ్వు షాజహాన్ మనిషివని తెలియకపోతే సమాజంలో నీకేం తక్కువ?" అంది నీరజ.

రవి, నీరజ చేతిని మృదువుగా తాకి "నాకు నమ్మకం

వుంది నీరజా—నీ మూలంగా నా జీవనపథం మారుతుంది...'' అన్నాడు.

2

''ఏమైంది నీకు...'' అన్నాడు షాజహాన్.

రవి మాట్లాడలేదు. అతని ముఖంలో ఏవిధమైన భావాలూ లేవు.

''నేను నిన్ను నాకోసం తయారుచేసుకున్నాను. నువ్వు నన్ను వదిలి వెళ్ళిపోతే నా శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరు అయిపోతుంది. అలా జరగడం నేను సహించను...''

''తప్పదు బాస్! మీరు నన్ను వదలిపెట్టేయాలి. అయితే నేను మీకో హామీ నిస్తున్నాను. మీరు నాకిచ్చిన శిక్షణ మరే ఇతర వ్యక్తి ప్రయోజనాలకూ ఉపయోగించబడదు. నేను గడపబోయేది చాలా సాదా జీవితం. ఏ పరిస్థితుల్లోనూ మీ జోలికి రాను. మీ వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోను. నాకు మీరు భగవంతుడు. రోజుకొకసారైనా మిమ్మల్ని స్మరించుకుంటూంటాను...''

''నామస్మరణవల్ల నా కొరిగేదేముంది? పని కావాలి. నీమీద చాలా ఆశలు పెట్టుకున్నాను. నీవల్ల కావలసినవి కొన్ని పనులున్నాయి ప్రస్తుతానికి. కనీసం అవైనా పూర్తి చేసి వెళ్ళిపో...''

''లేదు బాస్. ఒక మంచి నిర్ణయాన్నమలు పరచడానికి వాయిదాలు వేయకూడదు. ఇంక నేను ఏ పనులూ చేయలేను'' దృఢంగా అన్నాడు రవి.

''అయితే ఇదే నీ తుది నిర్ణయమా?''

"అవును."

"ఈ నిర్ణయం మూలంగా నీ ప్రాణాలు నీవికాకుండా పోతే?"_ కర్కశంగా అన్నాడు షాజహాన్.

"నేను మిమ్మల్నెదిరించను. అన్నింటికీ సిద్ధపడే వచ్చాను. చంపదల్చుకుంటే ఇప్పుడే ఈ క్షణంలోనే చంపేయవచ్చు మీరు. నేను నిరాయుధుణ్ని. మీ పట్ల కృతజ్ఞతాభావంతో కట్టుబడ్డవాణ్ని" అన్నాడు రవి.

షాజహాన్ కేమీ తోచలేదు. అతనికి రవి మొండితనం గురించి బాగా తెలుసును. రవికి ప్రాణభయంలేదు. అనుకున్న పని ఎంత కష్టమైనా సాధించితీరుతాడు. ఇలాంటి మనిషి ఎక్కడో కానీ ఉండడు. అనుకోకుండా తనకు దొరికాడు. ఇతన్ని వదులుకోవడం అతనికేమాత్రమూ ఇష్టంలేదు. అయితే ఈ మొండి మనిషిని లొంగదీసుకోవాలి. అందుకు ఏంచేయాలి?

షాజహాన్ ఓక్షణం ఆలోచించి, "ఇంతకీ నన్ను వదిలి పెట్టి పోతానని నువ్వనడానికి కారణం ఒక అమ్మాయి. అంతేనా?" అన్నాడు.

"అవును."

"అయితే నేను చెప్పిన పనులు నువ్వు చేయనిపక్షంలో ఆ పిల్లమీద అత్యాచారం జరుగుతుంది" అన్నాడు షాజహాన్.

రవి చలించలేదు. "అత్యాచారమంటే?"

"నీ కళ్ళముందే ఆమె దారుణంగా హింసించబడుతుంది. అప్పటికీ నువ్వు లొంగి రాకపోతే ఆమెకు మాన భంగం కూడా జరుగుతుంది..."

"నన్ను బెదిరించవద్దు బాస్. నా కళ్ళముందే మాన

భంగం జరిగినా నేనామెను పెళ్ళి చేసుకుంటాను. నేను ప్రేమిస్తున్నది ఆ మనిషిని. ఆ మనిషికున్న మనసును. ఆ రెండింటినీ సామాన్యులు మలినం చేయగలరని నేననుకోను. ఆ విధంగా అయితే నేనెప్పుడో మలినపడ్డాను." అన్నాడు రవి.

షాజహాన్ కు చిరాకు వేసింది. "ఆమె ముఖాన్ని వికృతంగా తయారుచేస్తాను..." అన్నాడు.

"అందం కారణంగానే ఆమె పట్ల నేనాకర్షింపబడ్డాను. కానీ మా మధ్య ప్రేమ ఏర్పడ్డాక ఇంక అందంతో పనిలేదు" అన్నాడు.

"నీ కళ్ళముందే ఆమెను హింసించి చంపేస్తాను" అన్నాడు షాజహాన్ కసిగా.

"అందువల్ల మీరు సాధించేదేముంది బాస్! మీపనులు నేనెలాగూ చేయను. ఆమె చనిపోయేక నేనూ నా ప్రాణాలు తీసుకుంటాను. అందువల్ల మీకు మనశ్శాంతి ఉండదు. మీరే పని చేసినా ఒక ప్రయోజనముంటుంది. కేవలం పగతో ఘోరాలు చేయగలరని నేననుకోవడం లేదు. మమ్మల్నిద్దర్నీ విడదీయడంద్వారా మమ్మల్ని బాధ పెట్టగలరు కానీ మీ పని జరిపించుకోలేరు. అటువంటప్పుడు మమ్మల్ని వదిలి మా మానాన మమ్మల్ని బ్రతకనిస్తే, మీ మనిషికి మీ రన్యాయం చేయలేదన్న తృప్తి మీకుంటుంది!"

ఏం మాట్లాడాలో తోచలేదు షాజహాన్ కు. అతనంటే ఊళ్ళోనే కాదు, అతని అనుచరుల్లో కూడా చాలా మందికి భయం. కానీ రవికి భయంలేదు.

రవి మొండివాడు. విపరీతమైన పట్టుదల అతనికి. ఆ

లక్షణాలు షాజహాన్ కి బాగా ఉపయోగపడతాయి. అందుకే అతను రవిని ముఖ్యానుచరుడిగా చేసుకున్నాడు. కానీ రవిలో ఉన్న మొండితనం, పట్టుదల ఇప్పుడు షాజహాన్ కే ఎదురు తిరిగాయి. వాటినెలా లొంగదీయాలో షాజహాన్ కర్థంకావడంలేదు.

“సరే నువ్వు వెళ్ళు...” అన్నాడు షాజహాన్.

“వెడుతున్నాను బాస్. వెళ్ళే ముందు మీకు మరోసారి చెబుతున్నాను. మీకై మీరు తలపడితే తప్ప నేను మీ జోలికి రాను. అప్పుడు కూడా తప్పనిసరి అయితే తప్ప మీమీద ఎదురుదెబ్బ తీయను” అని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు రవి.

3

కరెంట్ పోయిన కారణంగా మ్యాట్నీ షో వదిలేసరికి ఇంకో అరగంట ఆలస్యమవుతుంది. ఫస్టు షోకి వచ్చిన వారందరి ముఖాల్లోనూ అసహనం కొట్టివచ్చినట్లు కనబడుతోంది. థియేటర్ వద్ద నీరజ కూడా అసహనంగా పచార్లు చేస్తోంది. ఆ సమయంలో ఎవరో ఆమెను పలకరించి— “మిస్ నీరజ మీరే కదూ” అన్నారు.

తన్ను పలకరించిన వ్యక్తిని ఆశ్చర్యంగా చూసింది నీరజ. అతను తనకు పరిచయస్థుడు కాడు. చూడ్డానికి నడివయస్కుడిలాగున్నాడు. ముఖం రఫ్ గా వుంది కానీ పెద్దమనిషిలాగే కనిపిస్తున్నాడు.

“అవును—” అందామె.

“మీతో అయిదు నిముషాలు మాట్లాడాలి. అలా ఎదురుగా వున్న పార్కుకు వస్తారా?” అన్నాడతను.

“మీరెవరో నాకు తెలీదు” అంది నీరజ అనుమానంగా.

"నన్ను రవి పంపించాడు. చాలా అర్జంటు విషయం మీతో మాట్లాడాలి."

"మీ పేరు?"

"శంకరం" అన్నాడతను.

నీరజ "పదండి" అంది. ఇద్దరూ కలిసి ఎదురుగా వున్న పార్కులోకి వెళ్ళారు.

"చెప్పండి. రవి ఏమని చెప్పాడు?" అంది నీరజ ఆత్రుతగా.

"నన్ను రవి పంపలేదు" అన్నాడతను నవ్వి.

"మరి?"

"మీతో మాట్లాడడంకోసం చిన్న అబద్ధం చెప్పాను..."

నీరజ ముఖంలో కంగారు కనపడింది. "ఏమిటీ మీ ఉద్దేశ్యం?"

"ఏమీ లేదు. రవి విషయంలో చిన్న హెచ్చరిక చేసి పోదామని వచ్చాను."

నీరజ మాట్లాడలేదు. చెప్పమన్నట్లు చూసింది.

"మీరూ రవీ ప్రేమించుకున్నారు. అంతవరకూ నాకు తెలుసు. ఆ ప్రేమ ఇకమీదట కొనసాగడానికి వీల్లేదని చెప్పడానికి వచ్చాను."

"అంటే?"

"మీరు రవిని మరిచిపొండి."

"మరిచిపోకపోతే?"

"మీ తలిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు-ఇంటిల్లిపాదీ ఘోరంగా అవమానింపబడి హత్యచేయబడతారు" చాలా తాపీగా అన్నాడతను.

నీరజ కళ్ళలో భయం కనపడింది. "ఎందుకు?"

"మీరు రవిని మరిచిపోనందుకు!"

"నేను రవిని మరిచిపోవడం వల్ల మీకేమిటి ప్రయోజనం?"

"అది మీ కనవసరం."

"నా కనవసరమైనా మీ కవసరం కాబట్టి చెప్పాలి. రవినుంచి మీరేదో ప్రయోజనాన్నాశిస్తున్నారు. మా ప్రేమ కారణంగా ఆ ప్రయోజనం సిద్ధించదని భయపడుతున్నారు. అదేమిటో నాకు తెలిస్తే నేను రవిని ప్రేమిస్తూనే మీ ప్రయోజనం సిద్ధించేలా చేయగలను" అంది నీరజ.

ఈ పర్యాయం శంకరం ముఖంలో ఆశ్చర్యం కనబడింది. అతనీవిధమైన సమాధానానికి సిద్ధపడినట్లులేదు. క్షణం మాత్రం ఆలోచించి "అదేం కుదరదు. రవిని మీరు మర్చిపోవలసిందే..." అన్నాడు.

"రవిని నేను మరిచిపోవడం అసాధ్యం..." అంది నీరజ.

"అయితే సర్వనాశనానికి సిద్ధపడ్డట్లేనా?"

నీరజ మాట్లాడలేదు.

"చూడండి. నా గురించి మీకు పూర్తిగా తెలిసినట్లు లేదు. నేను వేళాకోళానికి మీ కివన్నీ చెప్పడంలేదు. అన్నంత పనీ చేయగలను నేను" అన్నాడు శంకరం.

"ప్రమాదకరమైన వ్యక్తులతో వేళాకోళాలాడ్డం నాకూ ఇష్టముండదు, కానీ నేను రవిని ప్రేమించాను. అతను లేకపోతే నేను బ్రతకలేను. అతను లేకుండా జీవించడంకంటే సర్వనాశనమైపోయినా బాధ లేదనిపిస్తుంది నాకు."

"మీరు రవిని మాత్రమే ప్రేమించారా? మీవారెవ్వరినీ ప్రేమించడం లేదా? మీకు జీవితంమీద ఆశ లేక పోయినంత మాత్రాన వారందరికీ ఉండకూడదని లేదు గదా-మీకోసం వారందర్నీ బలిచేయడం బాగుందా నీకు" అన్నాడు శంకరం.

"లేదు. కానీ ఇందులో నేను చేయగలిగినదేమీ లేదు. ఇతరులకోసం నేను రవిని వదులుకోలేను" అంది దృఢంగా నీరజ.

"అయితే సర్వనాశనం తప్పదు."

"మీరూ మరొక్కమారు ఆలోచించండి. రవినుంచి మీ రాశిస్తున్న ప్రయోజనమేమిటో చెప్పండి. అది తప్పక నెరవేరుస్తాను. ఆ విధంగా ఉభయులకూ జననష్టం లేకుండా పని జరుగుతుంది" అంది నీరజ.

ఈ పర్యాయం శంకరం కాస్త ఆలోచనలో పడ్డట్లు కనపడ్డాడు.

అయిదు నిముషాలసేపు వారిద్దరిమధ్య మౌనం రాజ్యమేలింది.

"షాజహాన్ పేరు విన్నారా మీరు?" అన్నాడు శంకరం.

"విన్నాను. ఆ పేరు వింటేనే నా ఒళ్లు జలదరిస్తుంది భయంతో" అంది నీరజ.

"నా పనులు కావాలంటే అతనితో భేటీకి సిద్ధపడాలి" అన్నాడు శంకరం.

"ఎందుకని?"

"అతనూ నేను కూడా నాలుగు ప్రయోజనాలు సాధించాలని ప్రయత్నిస్తున్నాం. అందుకు రవిలాంటి

సమర్ధుడి అవసరమెంతైనా ఉంది. రవి నాకోసం అవి సంపాదించాలంటే అతను విధిగా షాజహాన్‌తో భేటీ పడాలి. సిద్ధమేనా?"

"సిద్ధమే?" అంది నీరజ.

"షాజహాన్ అంటే భయంలేదు..."

"రవిని దక్కించుకోడానికి దేవుడితో భేటీ వచ్చినా భయపడను."

శంకరం ముచ్చటగా ఆమెవంక చూసి "ప్రేమ కథల్లో తప్పు ఉండదనుకునేవాణ్ణి. ఆ మాట అబద్ధమని ఇప్పుడనిపిస్తోంది. అయితే రవినుంచి నేనాశించే మొదటి ప్రయోజనమేమిటో చెబుతాను విను" అన్నాడు. "ఇన్‌స్పెక్టర్ రఘురాంవద్ద నా వేలిముద్ర ఫోటోలున్నాయి. అవి నావి అని వారికి తెలియదు. నేరం జరిగిన ప్రాంతంలో నెలరోజుల క్రితం పోలీసులు వాటిని కనుగొన్నారు. అవి పోలీసు రికార్డులో ఉండడం నా కిష్టంలేదు. వాటిని నాకు సంపాదించి పెట్టాలి."

"సరే_ వీటివల్ల షాజహాన్‌కేం ప్రయోజనం?" అంది నీరజ.

"మేమిద్దరం ప్రత్యర్థులం. ఆ నేరంజరిగిన ప్రాంతంలో మా ఇద్దరివీ కూడా వేలిముద్రలున్నాయి. ఒకరి తర్వాత ఒకరు అక్కడికి వెళ్ళడంవల్ల జరిగిందది. ఎవరి వేలి ముద్రలు సంపాదించడానికి వాళ్ళం ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందులో విజయం ఒకరిని మాత్రమే వరించడం తథ్యం. ఒకసారి మోసం జరిగితే రెండోసారి విషయంలో పోలీసులు జాగ్రత్తపడిపోతారు..." అన్నాడు శంకరం.

"మరి మీ వేలిముద్రలను గుర్తుపట్టడమెలా?"

శంకరం తన చొక్కా జేబులోంచి ఒక చిన్న కవరు అందించాడు నీరజకు. "ఇందులో నా వేలిముద్రల ఫోటో ఒకటుంది. అయిడెంటిఫికేషన్‌కు పనికివస్తుంది."

నీరజ అందుకుంది.

"చూడండి. మిమ్మల్ని అనుక్షణం నీడలా వెన్నాడుతూంటాను. మిమ్మల్ని నమ్మి నా పని అప్పగిస్తున్నాను. మోసం జరిగితే మాత్రం మీకు సర్వనాశనం తప్పదు. పోలీసులతో లాలూచీపడ్డా, ఈ ఫోటోను ప్రింట్సు తీయడానికి ప్రయత్నించినా నేను సహించను. నన్ను నేను రక్షించుకునేందుకు నా ఏర్పాట్లు నాకున్నాయి..." అన్నాడు శంకరం.

"మోసం ప్రసక్తి లేదు." అంది నీరజ.

"అయితే ఈ పని చేయడానికి సరిగ్గా రెండే రోజులు వ్యవధి ఇస్తున్నాను. ఎల్లుండి సాయంత్రం మిమ్మల్నిక్కడ ఇదే సమయంలో కలుసుకుంటాను. ఒంటరిగా ఒక్కరూ రావాలి మీరు. రవినికూడా తీసుకురావడంకానీ, మీకు రక్షణగా నిఘా ఏర్పాటు చేసుకోవడంకానీ జరగకూడదు..."

"అలాగే" అంది నీరజ. శంకరం గుడ్ బై చెప్పి వెళ్ళిపోయాడు.

నీరజ ఆలోచనలో పడింది. తన ప్రేమ ఫలిస్తుందా? అని అదేపనిగా ఆలోచిస్తోందామె. పరిస్థితులు తన ప్రేమ కనుకూలంగా వున్నట్లు లేవు.

రవితో మాట్లాడి ఇందుకు ఒప్పించినా పోలీసులవద్ద నుంచి వేలిముద్రలు సంపాదించడం అతి సామాన్యమైన

వ్యవహారం కాదు. ఒకవేళ సంపాదించినా అదింకా శంకరం కోరిన మొదటిపని మాత్రమే. అలాంటివి మరో మూడు చేయాలి.

నీరజకు సినిమా చూడాలని లేదు. అయినా తప్పదు. ఏడున్నరకు హాలుదగ్గర కలుసుకుంటానని చెప్పాడామెకు రవి.

4

నీరజకు సినిమా బుర్రలోకి ఎక్కడంలేదు. ఆమె వుండి వుండి టైము చూసుకుంటోంది. టైము ఏడున్నర కాగానే నిట్టూర్చి హాల్లోంచి బయటకు వచ్చిందామె. బయట ఆమెకోసం ఎదురుచూస్తున్న రవి వెంటనే కనిపించాడు.

"రవీ!" అందామె ఉత్సాహంగా. ఆమెనుచూస్తూనే రవి ముఖం వెలిగిపోయింది.

"ఎక్కడికి పోదామో చెప్పు" అన్నాడు రవి.

"చాలా సీరియస్ విషయం మాట్లాడాలి రవీ!" అంది నీరజ.

"నీతో సీరియస్ విషయాలు మాట్లాడడం నాకిష్టముండదు" అన్నాడు రవి.

"కానీ నేను కావాలనుకుంటే తప్పదు..." అంది నీరజ.

ఇద్దరూ హాలుకెదురుగా ఉన్న పార్కులోకి వెళ్లారు. ఓ మూల కూర్చున్నాక నీరజ రవికి తనదగ్గరున్న కవరు అందించింది.

"ఇదేమిటి?" అన్నాడు రవి.

"ఇన్‌స్పెక్టర్ రఘురాంవద్ద ఈ కవర్లో ఉన్నలాంటి

ఫోటో ఉంది. అది సంపాదించాలి నువ్వు...'' అంది నీరజ.

''ఎందుకు?''

''నన్ను వివరాలడగొద్దు. ఈ పని నీవల్ల అవుతుందో కాదో చెప్పు. దానిమీదే మన పెళ్ళి ఆధారపడి ఉంది...''

రవి ముఖంలో అనుమానం తొంగిచూసింది. ''నేను షాజహాన్‌ను వదిలిపెట్టింది నీ ప్రేమకోసం. కానీ నువ్వూ ఇంకో షాజహాన్‌లా ప్రవర్తిస్తున్నావు. నా ప్రేమను నీ స్వంతపనుల కుపయోగించుకోవాలనుకుంటున్నావు.''

నీరజ బాధగా రవివంక చూసి ''నువ్వు నన్ను నమ్మలేవా?'' అంది.

''కానీ నువ్వు చెప్పిన పని...''

''నిజంగా నా స్వంతపనికోసం కాదు. కేవలం మన ప్రేమ ఫలించడంకోసం. ఇప్పుడే ఇలా అనుమానిస్తే ఎలా? ఇంకా ఇలాంటివి మరికొన్ని చేయాల్సి ఉంటుంది. అప్పుడే మన పెళ్ళి జరుగుతుంది.''

''నేను చేయకపోతే...''

''నీ నీరజ కుటుంబసహితంగా దారుణహింసలకు గురవుతుంది. ఆ తర్వాత చచ్చిపోతుంది.''

నీరజ నెవరో బెదిరించారని రవికి అర్థమైంది. ఆ బెదిరించిన వ్యక్తి షాజహాన్ కావచ్చుననికూడా అతనికి తోచింది_అందుకే ''నేనీ పనులు చేసినంత మాత్రాన మన ప్రేమ ఫలించి మన వివాహం జరుగుతుందని నీకు నమ్మకంగా ఉందా?'' అన్నాడు.

''ఉంది. అవన్నీ నేను చూసుకోగలను.''

"అయితే సరే. రేపే ఈ ఫోటో పోలీస్ స్టేషన్నించి తస్కరిస్తాను" అన్నాడు రవి.

నీరజ, రవి వంక ఆశ్చర్యంగా చూసి, "ఇది చాల కష్టమైన పని. బహుశా ఈ ప్రయత్నంలో నువ్వు పోలీసులకు పట్టుబడిపోవచ్చు. అయినా ఆ భయం నీముఖంలో కనబడ్డంలేదు. బజారుకువెళ్ళి కూరగాయలు తెస్తానన్నంత సులభంగా మాట్లాడేశావ్" అంది.

"రవి సంగతి నీకు తెలియదు నీరజా! నాకు కష్టసాధ్యమైనదంటూ లేదు."

"అయితే ఆ షాజహాన్ నీ అతని ముఠానీ ఎందుకు సర్వనాశనం చేయవు?"

"కృతజ్ఞత అంతే!" అన్నాడు రవి.

5

రవినిప్పుడు ఎరిగున్న వాళ్ళెవ్వరూ గుర్తుపట్టలేరు. అంతలా మారిపోయింది రూపం. అతను సుమారు పది గంటల సమయంలో పోలీస్ స్టేషన్లో అడుగుపెట్టాడు.

"ఎవరు మీరు?" అనడిగాడు ఇనస్పెక్టర్ రఘురాం.

"మీరేనా రఘురాంగారు?"

"అవును నేనే!"

"మీతో చిన్న రహశ్యం చెప్పాలి. అభ్యంతరం లేకపోతే పక్కనేదైనా చిన్న గది ఉందా?" అన్నాడు రవి.

రఘురాం క్షణం తటపటాయించి "సరే పదండి!" అన్నాడు. ఇద్దరూ అక్కడున్న చిన్న గదిలోనికి వెళ్ళారు.

"రెండ్రోజుల క్రితం జరిగిందిది..." అన్నాడు రవి.

"అర్థరాత్రి ప్రాంతంలో ప్రవేశించాడతను మా ఇంట. వాడి తాకట్టు వ్యాపారం. ఇనప్పెట్టెనిండా నగ లున్నాయి. అతను చాలా ఆరితేరిన వాడిలాగున్నాడు. ఎంతో కష్టసాధ్యమైన ఇనప్పెట్టెను సులువుగా తెరిచేశాడు. ఆ సమయంలో నా భార్యకు మెలకువ వచ్చింది. అతన్ని చూసి దొంగ దొంగ అని అరిచింది. అప్పుడే నాకూ మెలకువ వచ్చింది. అతను చేతిలో కత్తితో మమ్మల్నిద్దర్నీ సమీపించాడు. కత్తి చూడగానే మా ఇద్దరి నోళ్ళూ మూతపడ్డాయి. అప్పుడే చిన్న తమాషా జరిగింది.

"నా భార్య చాలా అందంగా వుంటుంది. రాత్రి కావడం మూలానూ, భర్త పక్కనే పడుకున్న కారణం గానూ ఆమె ఒంటిమీద దుస్తులు సరిగ్గా లేవు. దొంగను చూసిన కంగారులో ఆమె దొంగ దొంగ అని అరిచింది కానీ ఆ తర్వాత నైట్ డ్రస్సునించి మామూలు డ్రస్సు లోకి మారే అవకాశమేదీ? దొంగకు అత్యాచారం చేయా లనిపించిందనుకుంటాను. నా భార్యను చూసి 'బంగారం కంటె బాగున్నావ్ నువ్వు!' అంటూ ఆమెను సమీపిం చాడు. ఒక మూల కత్తిని నా వైపు ఝుళిపిస్తూనే వున్నాడు.

మాట్లాడకుండా లొంగిపోతే నీ మొగుణ్ణేమీ చేయను. లేకపోతే మాత్రం..." అని ఆగాడు.

"వాడి మాటలు నా ఆవేశాన్ని రెచ్చగొట్టాయి. ఆ సంఘటననూ, వాడి బలహీనతనూ ఆధారంగా తీసుకుని నేను వాడిమీద ఎదురుదెబ్బతీయగలిగాను. వాడు తప్పించుకుని పారిపోయాడు. నా భార్య మానం, నా

నగలూకూడా రక్షించబడ్డాయి. అందుకు నాకు చాలా సంతోషం కలిగింది. నన్ను నేనే అభినందించుకున్నాను. తర్వాత ఇనప్పెట్టెను పరిశీలించాను. డిటెక్షన్ నా హాబీ. ఇనప్పెట్టెమీద వేలిముద్రలున్నాయి. మీ పోలీసుల పద్ధతులే ఉపయోగించి వాటికి ఫొటోలు తీశాను. దాని నమూనా నా దగ్గరుంది. ఇదిచూసి మీరు మీ రికార్డ్సు వెరిఫైచేసి ఇదివరలో ఏ పాత నేరస్థుడివైనా అయితే వెంటనే దొంగను పట్టవచ్చునని నా ఆశ. ఆ మనిషి ముఖం నాకు బాగా గుర్తుంది. ఎప్పుడు కనబడ్డా గుర్తు పట్టగలను."

రఘురాం బయటకు వచ్చి–వేలిముద్రల నిపుణుడు సుందరానికి ఫోన్ చేశాడు. ఆయన వచ్చి పోలీస్ రికార్డ్సు వెతికి–స్టేషన్‌లో ఉన్న తాత్కాలిక సదుపాయాలతో ఒక ఫోటోని వెదికితీసి "ఇదీ అదీ ఒకటేనని నా అనుమానం. ఎటొచ్చీ ఖచ్చితంగా చెప్పాలంటే రేపటివరకూ సాధ్యపడదు. ఈ ఫోటోని నాతో తీసుకు వెడతాను" అన్నాడు.

"వెంటనే చెప్పడం సాధ్యపడదా...?" అన్నాడు రవి.

"మీ రాయనతో వెళ్ళండి. ఓ గంటలో మీకు విషయం తెలుస్తుంది. అవి రెండూ ఒకటే అయిన పక్షంలో–మీకు మళ్ళీ నేరస్థుడు కళ్ళబడితే మాకు తెలియ జేయండి. రెండు నేరాల దొంగ బయటపడతాడు" అన్నాడు రఘురాం.

"అది సరే___ఇత నెటువంటి నేరస్థుడు?" అన్నాడు రవి.

"ఒక స్మగ్లింగ్ వ్యవహారంలో ఈ వేలిముద్రలు దొరికాయి" అన్నాడు రఘురాం.

రవి, సుందరం కలిసి వెళ్ళారు. సుందరం తన లాబొరేటరీలో రెండింటినీ జాగ్రత్తగా పరిశీలించి "నా అనుభవం నన్ను మోసం చేయదు. అసలు నేను ఫోటోలు చూసి అయిడెంటిఫై చేసేయగలను. ఈ రెండూ ఒకరివేనని పోలీస్ స్టేషన్లోనే కనిపెట్టేశాను. అయినా ఎందుకైనా మంచిదని..." ఇంకా ఏదో అంటూండగా రవి ఆయన భుజంమీద ఏదో పిన్‌తో గుచ్చాడు.

జరిగినదేమిటో ఆయన కర్థంకాలేదుకానీ మరో రెండు నిముషాల్లో ఆయనకు స్పృహతప్పింది. రవి రెండు ఫోటోలూ తీసుకుని అక్రమించి వెళ్ళిపోయాడు.

6

"నాకు తెలుసు రవి ఈ కార్యం సాధించుకురాగలడని..." అన్నాడు శంకరం ఆనందంగా ఫోటోల నందుకుని.

"మీ రెండో పని యేమిటో చెప్పండి..." అంది నీరజ.

"జగన్మోహన్ తెలుసా మీకు?"

"ఏ జగన్మోహన్?" అంది నీరజ ఆలోచిస్తూ.

"ఎర్ర కారు..." అని ఆగాడు శంకరం.

నీరజకు అర్థమైంది. ఆ ఊరికే పెద్ద ఆకర్షణ ఆ కారు. జగన్మోహన్‌కున్న మూడు కార్లలోనూ అది చాలా ముఖ్యమైనది. చాలామందా ఊళ్ళో ఆయన్ను ఎర్రకారు జగన్మోహన్ అని అంటూంటారు. జగన్మోహన్‌కు బట్టల షాపు ఉంది. కానీ ఒక బట్టలషాపు యజమానికంటే

బాగా ఎక్కువగా ఖర్చుపెడతాడాయన. ఆ ఊళ్ళో అగ్రశ్రేణి ధనికుల్లో ఆయనొకడు. కొంపదీసి ఆ కారు గానీ సంపాదించమనడు కదా అనుకుంది నీరజ.

"తెలుసు" అంది నీరజ.

"ఆయన అలా కనబడుతున్నాడుకానీ ఈ నగరానికే పెద్ద బ్లాక్ మెయిలర్. బ్లాక్ మెయిలింగ్ లో ఆయన సంపాదించిందాంట్లో సగం ముందు దు బట్టలషాపుమీద ఆయనకొచ్చే ఆదాయం" అన్నాడు శంకరం.

ఆశ్చర్యంగా వింటోంది నీరజ ఆయన చెబుతున్న విషయాన్ని. జగన్మోహన్ బ్లాక్ మెయిలర్ అన్న విషయాన్ని ఆమె ఊహించలేదు సరిగదా ఇప్పుడు శంకరం చెప్పినా నమ్మలేకపోతోంది.

శంకరం కొనసాగించాడు. "జగన్మోహన్ నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. ఏ నేరం జరిగినచోటున నా వేలిముద్రలున్నాయో—అక్కడే నన్ను ఫోటో తీశాడు. నన్ను రెడ్ హేండెడ్ గా ఫోటోలు తీశాడాయన. ఇప్పుడా ఫోటోతో బెదిరిస్తున్నాడు."

"అంటే ఆ నెగిటివ్స్ సంపాదించాలంటారు" అంది నీరజ.

"అవును."

"అది పెద్ద కష్టంకాదు. పోలీసులదగ్గర్నుంచి వేలిముద్రలు సంపాదించిన మనిషి ఒక మామూలు మనిషి దగ్గర్నుంచి నెగిటివ్స్ సంపాదించడం కష్టం కాదనుకుంటాను" అంది నీరజ.

"జగన్మోహన్ మామూలు మనిషి కాడు. మొదటి పనికంటే కష్టమైనదిది...." అన్నాడు శంకరం ఆలోచిస్తూ.

"అయినా తప్పదు కదా. ఆ నెగెటివ్స్‌నెలా గుర్తించాలో చెప్పండి" అంది నీరజ.

"నెగిటివ్స్ ట్వంటీటూ అంటే జగన్మోహన్‌కు అర్థమవుతుంది" అన్నాడు శంకరం.

నీరజ నవ్వి-"జగన్మోహన్‌ని అడిగి తెమ్మనా మీ ఉద్దేశ్యం?" అంది.

"ఇంచుమించు అలాగే చేయాలి. ఆ సామర్థ్యం రవికుంది. ఒక వేళ తప్పు నెగటివ్సు తెచ్చే మాటయితే అవి మళ్ళీ తిరిగిచ్చేసి సరైనవి తేవాల్సి ఉంటుంది. నేను మాత్రం మోసాన్ని సహించను. వేయి కళ్ళతో మీ ఇద్దర్నీ కనిపెడుతూనే ఉంటాను...." అన్నాడు శంకరం.

"బాగానే ఉంది. మిమ్మల్ని మళ్ళీ ఎప్పుడు కలుసుకోవాలి?"

"రోజు విడిచి రోజు సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఈ పార్కుకు వస్తుంటాను" అన్నాడు శంకరం

7

"నమస్కారమండీ - నా పేరు వీర్రాజు" అన్నాడు రవి.

జగన్మోహన్ అతనివంక చూసి "నువ్వెవరో నే నెరగను" అన్నాడు.

"నిన్నటివరకూ నేనూ మిమ్మల్నెరగను. కానీ ఒక ముఖ్యమైన పనిమీద మిమ్మల్ని కలుసుకోవాలని వచ్చాను."

"ఏమిటా పని?"

"నెగిటివ్సు ట్వంటీటూ గురించి మాట్లాడాలని వచ్చాను."

జగన్మోహన్ ముఖంలో కలవరం కనబడింది. "ఏమిటి నువ్వనేది? నాకేమీ అర్థంకావటంలేదు" అన్నాడు.

"అంతా అర్థమైంది మీకు. ఊరికే నటిస్తున్నారంతే! నేనేమీ సిబిఐ మనిషిని కాను. మీవంటిదే నా వృత్తి కూడా" అన్నాడు రవి.

"మిస్టర్ వీర్రాజూ! నువ్వేం మాట్లాడుతున్నావో నిజంగా నాకర్థంకావడంలేదు."

"అయితే వివరంగా చెబుతాను వినండి. ఒక మనిషిని నేరం జరిగిన స్థలంలో ఫోటో తీశారు మీరు. ఆ నెగటివ్సుకు నెగిటివ్స్ ట్వంటీటూ అని పేరు పెట్టారు. వాటితో ఆ మనిషిని బెదిరిస్తున్నారు. ఆ మనిషి నన్ను కలుసుకున్నాడు. మిమ్మల్నడిగి ఆ నెగిటివ్సు తెచ్చిపెట్టమన్నాడు. సాధారణంగా ఎవరైనా నేనడిగిన వెంటనే ఏమడిగితే అది ఇచ్చేస్తారు. ఆ నమ్మకంతోనే ఇక్కడకు వచ్చాను."

జగన్మోహన్ నవ్వి "ఏమిటి నీ స్పెషాలిటీ?" అన్నాడు.

"నా స్పెషాలిటీ ఏమిటని అడక్కండి. నేనే ఒక స్పెషాలిటీ" అన్నాడు రవి.

"సరే-ఇప్పుడేం చేయదల్చుకున్నావ్?"

"మీరు నెగిటివ్సివ్వగానే తీసుకుని వెళ్ళి ఆ మనిషికిచ్చేయదల్చుకున్నాను."

"అందుకు ప్రతిఫలం?"

"ప్రతిఫలం అవసరంలేదు నాకు. అందు మూలంగా

నా పెళ్ళి ఆగిపోయింది. అందుకని ఈ పనికి ఒప్పు కున్నాను" అన్నాడు రవి.

"మిస్టర్ వీర్రాజు—ఆ మనిషి యిప్పుడెక్కడున్నాడు?"

"ఊరి చివర ఒక బంగళాలో."

"నేనూ వస్తాను నీతో. ఆ మనిషితో మాట్లాడుతాను. పద!"

"నెగెటివ్స్ కూడా తీసుకురండి."

"అవసరంలేదు. నేనా మనిషితో మాట్లాడి నిన్ను పంపించేస్తాను. వ్యవహారం మేమిద్దరం చూసుకుంటాం" అన్నాడు జగన్మోహన్.

"నాతో వచ్చే ధైర్యముంటే రండి...." అన్నాడు రవి.

జగన్మోహన్ తమాషాగా నవ్వి "నన్నీమాట అనగలిగిన నీ ధైర్యానికి మెచ్చుకుంటున్నాను. నిన్ను చూస్తే నాకు ముచ్చటగాకూడా వుంది. నీలాంటివాడివల్ల నాకూ చాలా ఉపయోగాలుంటాయి" అన్నాడు.

రవి ఏమీ మాట్లాడలేదు. ఇద్దరూ బయల్దేరి బయటకు వచ్చారు. ఇంటిముందున్న ఎర్ర కారును చూసి—"ఇలాంటి కారు నే నెక్కడా చూడలేదు!" అన్నాడు రవి.

"ఎక్కడా చూడని వస్తువులూ ఎవ్వరూ అనుభవించని అనుభవాలూ సేకరించడం నా హాబీ" అన్నాడు జగన్మోహన్.

ఇద్దరూ కార్లో కూర్చున్నారు. కారు తూనీగలా దూసుకుపోతోంది. ఊరి చివరకు వచ్చేక ఒక బంగళా ముందు కారాపమని చెప్పాడు రవి.

"ఈ దారీ, బంగళా కూడా కొత్తవి నాకు" అన్నాడు జగన్మోహన్.

"చాలా కొత్త కొత్త విశేషాలు చూస్తారు మీరు నా దగ్గర" అన్నాడు రవి.

జగన్మోహన్ నవ్వి– కారు దిగాడు. రవికూడా కారు దిగి ముందుకు దారి తీశాడు. జగన్మోహన్ అతన్ననుసరించాడు.

ఇద్దరూ బంగళాలో ప్రవేశించారు. లోపలకు వెళ్ళగానే హాలొకటుంది. హాల్లో సోఫాలున్నాయి.

"కూర్చోండి. ఆ మనిషిని పిలుస్తాను" అన్నాడు రవి.

జగన్మోహన్ కూర్చున్నాడు. అతని పక్కనే రవి కూడా కూర్చున్నాడు.

"మరి– ఆ మనిషిని పిలుస్తానన్నావ్?" అన్నాడు జగన్మోహన్.

"సోఫాకున్న బటన్ నొక్కితే లోపల బెల్ మ్రోగుతుంది" అన్నాడు రవి. జగన్మోహన్ బటన్ చూడ్డానికి వెనక్కి తిరిగాడు. అప్పుడే ఆయన భుజంమీద ఏదో గుచ్చుకుంది.

"ఏమయిందీ?" అన్నాడు జగన్మోహన్. రవి జవాబు చెప్పలేదు. సరిగా రెండు నిమిషాల్లో జగన్మోహన్‌కు పూర్తిగా స్పృహ తప్పింది.

రవి అక్కణ్ణించి బయటకువచ్చి ఎర్ర కార్లో కూర్చున్నాడు. కారు కొత్తదారి పట్టింది.

8

"హలో సార్, గుర్తున్నానా?" అన్నాడు రవి.

జగన్మోహన్ కోపంగా రవి వంక చూసి–"నువ్వు

నన్ను మోసంచేశావ్'' అన్నాడు.

''ఇందులో మోసమేమీ లేదు. నెగెటివ్స్ ట్వెంటీ టూ నాకు కావాలి. అవి ఇచ్చేస్తే నా దారిన నేను వెళ్ళిపోతాను.''

''ఇవ్వకపోతే?''

''మీ ఎర్రకారును మీరింక చూడలేరు.''

''ఆఁ'' జగన్మోహన్ నోరు తెరిచాడు. ఎర్ర కారు అతని ప్రాణాలకంటె విలువైనది. ఆ రోజు స్పృహ రాగానే తను మొట్టమొదట దానికోసమే చూశాడు. అది కనపడకపోగా చాలా కలవరపడ్డాడు. అయితే పోలీస్ రిపోర్టుమాత్రమివ్వలేదు. ఆ కారును పోలీసుల దృష్టిలోకి తీసుకువెళ్ళడం ఆయనకిష్టంలేదు. అది తనకు ప్రాణాప్రదమైన కారు మాత్రమే కాక - ఆ కారులో తన ప్రాణాలూ ఉన్నాయి. ''ఈ దేశం మొత్తంమీద అలాంటి కారొక్కటే ఉంది. ఎక్కడున్నా కనుక్కో గలను''అన్నాడు జగన్మోహన్ తేరుకున్నాక.

''కనుక్కోవడానికి కారుండాలి కదా'' ప్రస్తుతం ఎవ్వరూ కనుక్కోలేని చోట ఉంది. నా పని జరక్క పోతే ఆ కారు నాశనమైపోతోంది'' అన్నాడు రవి తాపీగా.

''నీ పని జరిగితే నా కారు తిరిగివస్తుందని నమ్మక మేమిటి?''

''నమ్మకం లేనిదే మన వృత్తిలో నెగ్గుకు రావడం కష్టం. ఉదాహరణకు మీ కారు సంగతి తీస్కోండి. దాని గురించి నా కన్నివివరాలూ తెలుసు. ఈ నెగెటివ్స్ కంటె ఆ కారు మీకు చాలా ముఖ్యమన్నది మీరు దాచినా దాగని నిజమని నాకు తెలుసు.

ఆ కారు విషయంలోనే కాదు, ఈ ఊళ్ళో చాలా మందికి సంబంధించిన చాలా విషయాలు తెలుసు నాకు. కానీ వాటివల్ల ఎవరికీ ఏ ప్రమాదమూ లేదు. అవసరం లేనిదే నేనెవరి జోలికీ వెళ్ళను. మీ కారుకు రంగు, కొద్దిగా మోడల్ మారిస్తే నాకు చాలా ఉపయోగం. అయినా నేనది తీసుకోను. నెగటివ్స్ కోసం మాత్రం దాన్ని తీసుకున్నాను. అవి చేతికి రాగానే మీ కారు మీకు అప్పగిస్తాను.''

జగన్మోహన్ కాసేపు ఆలోచించి ఏమనుకున్నాడో లోపలికి వెళ్ళాడు. పదిహేను నిమిషాల అనంతరం ఓ చిన్న కవరుతో తిరిగివచ్చాడు. అది రవికి అందించాడు. రవి అందుకుని చూశాడు. దానిమీద N-22 అని వుంది.

''కారు ఎప్పుడిస్తావ్?'' అన్నాడు జగన్మోహన్.

''ఈ నెగటివ్స్ సరైనవేనని తెలిసేక'' అన్నాడు రవి.

''మిస్టర్ వీర్రాజూ- ఐ హోప్ యూ డోన్ట్ ప్లే విత్ మి-'' అన్నాడు జగన్మోహన్.

''మీ దీ సేమ్ విత్ యూ...'' అన్నాడు రవి.

9

''నాకేమీ ఆశ్చర్యంగా లేదు. రవి ఘటనాఘటన సమర్థుడు'' అన్నాడు శంకరం ఆ నెగటివ్స్ అందుకుని పరీక్షించి చూసేక.

''అయితే ఈ పని అయినట్లేనా?'' అంది నీరజ.

''ఆహా- అయినట్లే?'' అంటూ ఆలోచనలో పడ్డాడు శంకరం.

''నాదో చిన్న అనుమానం. మీకు రవి గురించి బాగా

తెలిసినట్లుంది. మీరే స్వయంగా కలుసుకోవడంలేదేం?''
అంది నీరజ.

''రవి ఇప్పుడు ఎవరిమాటా వినడు. అతను సంఘంలో సామాన్య జీవనం చేయాలని నిశ్చయించుకున్నాడు. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. మీకోసం ఈ పనులన్నీ చేస్తున్నాడు తప్పితే ఇంకొకరి కతనిచేత ఈ పనులు చేయించడం సాధ్యపడే విషయం కాదు'' అన్నాడు శంకరం.

నీరజ నిట్టూర్చింది. తన్ను పెళ్ళి చేసుకుని సామాన్య జీవనం చేయాలనుకుంటున్నాడు రవి. తనకోసం తన పాత జీవితాన్ని వదిలిపెట్టేయదల్చుకున్నాడు. అతన్ని తను పాత జీవితంలోకే నడిపిస్తోంది. ఇంతవరకూ రెండు ప్రమాదాలూ గడిచాయి. ఇకముందుకూడా ఇలా గడిచి పోయి తనయొక్క, అతనియొక్క ఆశయం సిద్ధిస్తుందా?

''మీ మూడో పని ఏమిటి?'' అంది నీరజ భయపడుతూనే. తడవ తడవకూ ప్రమాదం పెరుగుతుందని ఆమెకు అనిపిస్తోంది.

''కైలాసరావు తెలుసా మీకు?'' అన్నాడు శంకరం.

తెలియదని నీరజ ఎలా చెప్పగలదు? ఒక దారుణ హంతకుడిగా అతన్ని పేపర్లు అభివర్ణించాయి. రెండురోజుల క్రితమే అతను పోలీసులకు పట్టుబడ్డ వైనం కూడా పేపర్లో చదివింది. కైలాసరావుమీద ఎన్నో కేసు లున్నాయి. వాటిలో చాలావరకూ హత్యలు, మాన భంగానికి సంబంధించినవి. ఈమధ్యనే అతను ఒక హోటల్లో బసచేసిన ధనవంతుణ్ణి కిరాతకంగా హత్య చేశాడు. ఇప్పుడా కైలాసరావును పోలీసులదగ్గర్నుంచి విడిపించమనడుగదా ఈ శంకరం?

"తెలుసు. అతను ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్నాడు" అంది నీరజ.

"అవును" అని శంకరం మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. రెండు నిముషాల అనంతరం "మీకు శ్యామసుందర్ తెలుసా?" అన్నాడు మళ్ళీ.

"తెలియదు" అంది నీరజ.

"శ్యామసుందర్ లక్ష్మీనారాయణగారబ్బాయి."

"నాకు లక్ష్మీనారాయణగారుకూడా తెలియదు..." అంది నీరజ.

"ఆయన దీ ఊరే. ఈమధ్య కైలాసరావుచేతహోటల్లో హత్యచేయబడినది లక్ష్మీనారాయణగారే..." అన్నాడు శంకరం.

నీరజకింకా శంకరం చెప్పదల్చుకున్నదేమిటో తెలియ లేదు కానీ ఆమె గుండె జలదరించడం మొదలయింది... "అయితే!" అంది.

"లక్ష్మీనారాయణగారు హత్యకాబడడానికి కారణం నేనే!" అన్నాడు శంకరం.

నీరజ తృళ్ళిపడి "అంటే?" అంది.

"కైలాసరావును నేనే పురమాయించాను. లక్ష్మీ నారాయణగారిని చంపమని అతనికి నేను చెప్పలేదు. ఒక వస్తువును సాధించమని అతనికి చెప్పాను. అది లక్ష్మీ నారాయణగారి వద్ద ఉంది."

"ఏమిటా వస్తువు?"

"బంగారం తయారుచేసే యంత్రం" అన్నాడు శంకరం.

నీరజకు అర్థంకాలేదు కానీ కుతూహలంగా వింటూ కూర్చుంది.

శంకరం చెప్పసాగాడు. “అదాట్టే పెద్దది కాదు. కానీ గంటలో యాభై బిస్కట్లు తయారౌతాయి. ఇత్తడి బిస్కట్లు లోపలకు తోస్తే బంగారం బిస్కట్లుగా మారతాయన్నమాట. అందులో పెద్ద తమాషా ఏమీ లేదు. బంగారం పూత వస్తుందన్నమాట వాటికి.

అయితే ఈ పూతలో ఒక తమాషా ఉంది. ఒక మాదిరి పరీక్షలో అవి బంగారం కాదని నిర్ణయించడం కష్టమవుతుంది ఈ పూత మూలంగా. అలాగని బంగారం కూడా ఎంతో పట్టదు. ఇది లక్ష్మీనారాయణగారి వద్ద ఉంది. కానీ ఎక్కడ వుందో తెలియదు. ఇది మాకు చాలా అవసరం. ఒక్కోసారి కస్టమర్సునీ, ఒక్కోసారి పోలీసులనూ మోసగించడానికీ యంత్రం మాకు బాగా సహకరిస్తుంది.

లక్ష్మీనారాయణగారు దాన్నెలాగో ఒక ఫారినర్ దగ్గర సంపాదించాడు. దాంతో ఆయన గిల్టు నగల వ్యాపారం చేస్తున్నాడు. కానీ ఇత్తడిని బంగారంగా మార్చడం కూడా వుందని నా అనుమానం.

అది సంపాదించడానికి కైలాసరావుని నియోగించాను. అతనికి రవిలాంటి బుర్ర లేదు. అతను దీనికి ప్రయత్నిస్తున్నాడని తెలియగానే లక్ష్మీనారాయణగారు తెలివిగా అతన్ని బుట్టలో వేశాడు. దానిమీద అతను రెచ్చిపోయి ఆయన్ను హత్యచేశాడు. అందులో కూడా అట్టే తెలివి ప్రదర్శించకపోవడం వల్ల చివరకు పోలీసులకు దొరికిపోయాడు.

ఉన్న సుగుణమల్లా ఏమిటంటే అతను తనవారి గురించిన రహస్యాలు ప్రాణం పోయినా చెప్పడు. నాకు

సంబంధించినవాళ్ళలో ఒక ముఖ్యుడు పోతున్నాడు. నాకు బాధగానే వుంది. ఆ సంగతలాగుంచితే అసలుపని జరగలేదు గదా—ఇప్పుడా మిషన్ నాకా్కవాలి. అది శ్యామసుందర్ దగ్గరుంది.''

నీరజ క్షణం ఆలోచించి ''లక్ష్మీనారాయణగారు తెలివిగా కైలాసరావుని బుట్టలో వేశాడంటున్నారు కదా—ఏ విధంగానో చెప్పగలరా?'' అనడిగింది.

''ఫలానా చోటికి వస్తే ఆ యంత్రం అతనికిస్తానని ఆయన చెప్పాడు. వీళ్ళ పరిచయం కేవలం టెలిఫోన్ కాల్స్‌వరకే పరిమితం. కైలాసరావు, లక్ష్మీనారాయణ గారి మాటలు నమ్మి అక్కడికి తన మనిషిని పంపాడు. వాణ్ణాయన తన మనుషులచేత బంధింపజేసి నానా హింసలూ పెట్టి కైలాసరావు గురించిన వివరాలులాగాడు. ఆ తర్వాత ఆయన మనుషులు కైలాసరావును వేటాడడం మొదలుపెట్టారు. ఈ విషయం పసిగట్టి జరిగిన మోసం గ్రహించడానికి కైలాసరావుకు రెండురోజులు పట్టింది. గ్రహించేక లక్ష్మీనారాయణగారు ఘోరాతిఘోరంగా హత్య చేయబడ్డాడు.''

నీరజకు భయంవేసింది. ''శ్యామసుందర్ ఎటువంటి మనిషి?'' అంది.

''చాలా సౌమ్యంగా కనపడతాడు కానీ సమయం వచ్చినపుడు పచ్చి రక్తం తాగడానికి జంకని మనిషని నా అనుమానం'' అన్నాడు శంకరం.

నీరజ మాట్లాడలేదు.

''చాలా ప్రమోదకరమైన పని ఇది. నాకా యంత్రం కావాలి'' అన్నాడు శంకరం.

10

"చాలా థాంక్స్ మిస్టర్ వీర్రాజూ! అన్న ప్రకారం నా కారును నా కప్పగించావు" అన్నాడు జగన్మోహన్.

రవి నవ్వి "అంటే మీలో నామీద అనుమానమున్న దన్నమాట" అన్నాడు.

"ఇట్స్ నేచురల్" అన్నాడు జగన్మోహన్.

"అనుమానమున్న చోట మోసముంటుంది. నేను మోసాన్ని సహించను. నెగెటివ్స్ ట్వెంటీటూవు మీ దగ్గర డూప్లికేట్సున్నాయా?"

"నా కారు నాకు చాలా విలువైనది. ఎలాంటి రిస్కూ తీసుకోను నేను. నాకూ నెగెటివ్స్ ట్వెంటీటూకూ ఋణం చెల్లిపోయింది. ఇది నిజం" అన్నాడు జగన్మోహన్.

"అయితే సరే–కానీ మీరు నన్నుకూడా ఇకమీదట మరిచిపోవాలి. నన్ను ఫాలో చేయడానికిగానీ నా ఉనికి తెలుసుకుందుకుగానీ ఏ విధమైన ప్రయత్నాలూ చేయకూడదు. అలాంటి ప్రయత్నాలు చేసినట్లు నాకు ఏ మాత్రం అనుమానం కలిగినా ఫస్టుఎటాక్ ఎర్రకారుమీదే నని గుర్తుంచుకోండి" అన్నాడు రవి.

"నా సంగతి సరే. నువ్వూ నా జోలికి రాకూడదు."

"భలేవారే. మీకూ నాకూ ఏ సంబంధమూ లేదు. నేను మిమ్మల్ని మరిచిపోవడం అప్పుడే ప్రారంభ మయింది. వస్తాను మరి" అన్నాడు రవి.

జగన్మోహన్ ఆశ్చర్యంగా చూస్తూండగా అతనక్క ణ్ణించి బయటపడ్డాడు. తర్వాత అతను ఊరంతా గజి బిజిగా తిరిగాడు. అలా తిరిగి తిరిగి ఒక సందులోని గది

లోకి వెళ్ళాడు. ఆ గదిలో అతని వేషం మళ్ళీ మారింది. కాసేపు అద్దంముందు నిలబడి కొత్త వేషానికి అనుగుణంగా కొంత నటన ప్రాక్టీసు చేశాడతను. అలా ఓ పావుగంట అక్కడ గడిపేక — గదికున్న ఇంకో తలుపు తీసుకుని బయటపడ్డాడు.

మళ్ళీ కాసేపు సందులు తిరిగి రోడ్డుమీదకు వచ్చాడు. కనబడ్డ ఆటో ఎక్కి తనకు కావలసిన అడ్రస్ చెప్పాడు. సుమారు పది నిముషాల్లో ఆటో అతన్ని ఇంటికి తీసుకు వెళ్ళింది.

రవి ఆటో దిగి మీటరు ప్రకారం డబ్బిచ్చి-నాలుగడుగులు వేసి ఆ ఇంటి తలుపు తట్టాడు.

సుమారు రెండునిముషాల అనంతరం ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. ఒక అందమైన అమ్మాయి సుమారు ఇరవై ఏళ్ళది — గుమ్మంలో నిలబడి వుంది.

“మిస్ స్నేహా — నేను లోపలకు రావచ్చునా?” అన్నాడు రవి.

ఆమె ఆశ్చర్యంగా అతనివంక చూసి “మీరెవరో నాకు తెలియదు” అంది.

“నా ప్రశ్నకు జవాబు అదికాదు. లోపలకు రావచ్చా అని అడిగాన్నేను” అన్నాడు రవి.

“అందుకే మీరెవరో నాకు తెలియదన్నాను” అంది స్నేహా విసుగ్గా.

“అయితే ఈ ఇంట్లోకి వచ్చేవాళ్ళందరూ మీకు తెలిసినవాళ్ళేనా?” అన్నాడు రవి.

స్నేహ తడబడి “లోపలకు రండి!” అంది. అతను లోపలకు రాగానే తలుపులు వేసి “ఎవరు మీరు ఎందుకు వచ్చారు?” అనడిగింది.

"నేను మీకు శత్రువును కాను. మీకేమీ అపకారం తలపెట్టను. మీతో చిన్న పనుండి వచ్చాను. పని చిన్నదైనా ప్రతిఫలం పెద్దదిగా ఉంటుంది" అన్నాడు రవి.

"మీ పేరు?"

"పేరు కావాలనుకుంటే అశోక్ అని పిలవ్వచ్చు" అన్నాడు రవి.

"మిస్టర్ అశోక్-మీకు నాతో ఏం పని?" అంది స్నేహ.

"తెలుసుకోబోయేముందీ ఫోటో చూడండి" అంటూ జేబులోంచి ఒక ఫోటో తీసి స్నేహకు అందించాడు రవి. స్నేహ ఆ ఫోటో అందుకుని చూసి తృళ్ళిపడింది. అందులో కండలు తిరిగిన వస్తాదొకడున్నాడు. వాడి ముఖం చాలా భయంకరంగా వుంది.

"నయాన నా మాట వినని వాళ్ళకోసం ఇతన్ని వాడుతూంటాను. ఆడవాళ్ళను హింసించడంలో ఇతను స్పెషలిస్టు" అన్నాడు రవి.

"ఇదంతా ఎందుకు చెబుతున్నారో నాకర్థంకావడం లేదు" అంది స్నేహ. అర్థంకానప్పుడు తన గుండె ఎందుకు జలదరిస్తోందో ఆమెకు తెలియడంలేదు.

"మీ దగ్గరకు వచ్చే అతి కొద్దిమందిలో శ్యామ్‌సుందర్ కూడా ఉన్నాడు. అతన్నిరోజు పిలవండి. బాగా రెచ్చగొట్టండి. ఇద్దరూ అనుభవాలు పంచుకోండి. నేను కాసిని ఫోటోలు తీసుకొంటాను."

స్నేహ భయంగా చూసింది. "అయితన్ను బ్లాక్ మెయిల్ చేయడానికా? అలాగైతే నా ప్రాణాలు పోతాయి" అంది.

"నేను బ్లాక్ మెయిలర్ని కాను. ఆ ఫోటోలు బ్లాక్ మెయిలింగ్ కోసం కాదు. నా పని ఏమిటో మీకనవసరం. కానీ అందువల్ల మీకే ఇబ్బందీరాదని హామీ ఇస్తున్నాను. నేను చెప్పినదానికి అంగీకరించకపోతే మాత్రం..." అని ఆగి "అన్నట్లు ఆ ఫోటో ఇలా ఇచ్చేయండి. మీకు దాని అవసరం లేదనుకుంటాను" అని ఆమె దగ్గర్నుంచి ఫోటో అందుకున్నాడు రవి.

"నాకు భయంగా ఉంది" అంది స్నేహ.

"భయం అనవసరం. మీకు శ్యామసుందర్ కీ ఉన్న సంబంధం ఈ ఊళ్ళో చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసును. అంత గొప్ప రహస్యం నాకూ కూడా తెలుసును. శ్యామసుందర్ మీరంటే పడి చస్తాడనీ-అడిగినప్పుడల్లా అతనికి లొంగకపోవడమే అందు కారణమనీ కూడా నాకు తెలుసును మీరు పిలిస్తే ఎన్ని పనులున్నా మానుకుని క్షణాలమీద పరుగెత్తుకుని వస్తాడనికూడా తెలుసు.

ఇవన్నీ నాకెలా తెలిశాయని నన్నడగొద్దు. తెలుసుకునేందుకు ప్రయత్నించవద్దు. నా గొప్పతనాన్నర్థం చేసుకోవడానికి మాత్రమే ఈ విషయాలు గుర్తుంచుకోవాలి. ఆ తర్వాత-నేను అన్నమాటమీద నిలబడేవాడిని. ఈ రోజు తీయబోయే ఫోటోలతో నాకొక చిన్న పనుంది. ఆ పని ముగియగానే ఈ ఫోటోలు నాశనం చేయబడతాయి. ఎటొచ్చీ నన్ను మోసగించడానికి ప్రయత్నిస్తే మాత్రం— నేనిందాక చూపించిన ఫోటో ఉందికదా... అది గుర్తుంచుకోవాలి" అన్నాడు రవి.

11

"ఏమైంది మేడమ్?"

"టైర్లో గాలిలేదు" అందామె నిరుత్సాహంగా.

"మీ డ్రైవర్ లేడా?"

"లేడు. కారు నేనే స్వయంగా డ్రైవ్ చేసుకుని వచ్చాను."

"నేను మీకేవిధంగా సహాయపడగలనో చెప్పండి."

"థాంక్స్. నాకే సాయం అవసరంలేదు. రిక్షాలోనో, టాక్సీలోనో ఇంటికి వెళ్ళిపోతాను" అని "నాకో టాక్సీ పిలవగలరా?" అందామె.

"మరి మీ కారు?"

"ఇంట్లో ఎవరూ లేరు. ఆయన ఊళ్ళో లేరు. ఈ హోటలు ప్రొప్రయిటర్ని రిక్వెస్టు చేస్తాను" అందామె.

అతనక్కణ్నించి కదలగానే ఆమె హోటలు ప్రొప్రయిటర్ని కలుసుకుని పరిస్థితి వివరించింది. అతనామెను కలవరపడవద్దనీ కారు విషయం తను చూస్తాననీ వాగ్దానం చేసి, "ఇంటికెలా వెడతారు? మా కార్లో డ్రాప్ చేయమంటారా?" అన్నాడు.

"అవసరం లేదండి. చాలా థాంక్స్" అని ఆమె అక్కణ్నించి బయటపడింది. బయట ఆమెకు ఇందాకా పలకరించిన యువకుడు కనపడలేదు. అదృష్టవశాత్తూ ఆటో దొరికింది. ఆమె ఇల్లు చేరింది.

ఆమెను చూస్తూనే వాచ్‌మన్ సలాంకొట్టి "ఆటోలో వచ్చారేమమ్మా, కారేమయింది?" అనడిగాడు. క్లుప్తంగా అతనికి పరిస్థితిని వివరించి ఇంట్లో అడుగుపెట్టింది. ఆమె వెళ్ళేసరికి హాల్లో ఆయా ఆమెకోసం ఎదురుచూస్తోంది.

"బాబు నిద్రపోయాడమ్మా. మరి నేను వెడతాను" అంది ఆయా.

ఆయా వెళ్ళిపోయేక తలుపులు వేసుకుందామె. అంత ఇంట్లోనూ ఇప్పుడు తనొక్కర్తే ఉంది. అయితే ఇదామెకు కొత్త కాదు. పడకగదిలోకి వెళ్ళి నిద్రపోతున్న కొడుకును చూసి ఒకసారి ప్రేమగా బుగ్గలు నిమిరింది.

ఆమెకు ఒళ్ళంతా చిరాగ్గా ఉంది. అది ఎయిర్ కండిషన్డు థియేటర్ కాకపోవటంతో బాగా ఉక్కపోసింది. బయట కూడా వాతావరణం ఉక్కగానే వుంది.

ఆమె టవల్ తీసుకుని బాత్ రూమ్‌కు బయల్దేరింది. ఓర వాకిలిగా ఉన్న బాత్ రూమ్ తలుపులు తెరిచిన ఆమె తెల్లబోయింది. ఆ గదిలో ఒక యువకుడు నిలబడి నవ్వుతున్నాడు. కొద్దిసేపటిక్రితం తనకు హాలువద్ద కనపడ్డ యువకుడతనే!

"ఇందాకా నా పేరు చెప్పడం మరిచాను. అయాం మిస్టర్ అశోక్!" అన్నాడతను నవ్వుతూ.

అతన్నీ అతని నవ్వునూ చూస్తూంటే ఆమెకు భయం వేసింది. "ఎవర్నువ్వు?" అంది కంగారుగా.

"కంగారు పడవద్దు. నా వల్ల నీకే ప్రమాదమూ వాటిల్లదు. నేనిక్కడికి రావడంలో ఏ విధమైన దురుద్దేశ్యమూ లేదు..." అన్నాడు రవి.

"అయితే ఎందుకొచ్చావ్?" అందామె కంగారుగా.

"నువ్వు స్నానంచేసే ఉద్దేశ్యంతో లోపలికి వచ్చినట్లున్నావ్- నేను బయటకు పోతాను. నువ్వు స్నానం ముగించుకురా. తీరుబడిగా మాట్లాడుకుందాం" అన్నాడు రవి.

"అవసరంలేదు. స్నానంచేసే ఉద్దేశ్యం పోయింది. ఏం చెబుతావో చెప్పు" అందామె.

"అయితే ఎక్కడ మాట్లాడుకుందాం? క్రింది హాల్లో అయితే మరీ బట్టబయలుగా వుంటుంది. ఇక్కడే అయితే ఇబ్బందిగా వుంటుంది. నీ పడగ్గదికి పోదాం. నేనేం చేయన్లే" అన్నాడు రవి.

ఇద్దరూ ఆమె పడకగదిలోకి వెళ్ళారు. ఆమె మంచం మీద కూర్చుంటే- డ్రస్సింగు టేబిల్ ముందుండే బల్ల లాక్కుని అతనామెకెదురుగా కూర్చుని, "నువ్వు చాలా అందంగా వున్నావు" అన్నాడు.

"ఇదేనా నువ్వు చెప్పదల్చుకున్న విషయం?" అందామె.

"కాదు. అందం ఆడదానికి వరం. అయితే నాలాంటి మగవాళ్ళున్నప్పుడది శాపంగా కూడా పరిణమిస్తుంది. నేను చెప్పదల్చుకున్న విషయం ఇదే!" అన్నాడు రవి.

"అంటే?"

"ఈ ఫోటో చూడు" అంటూ రవి ఆమెకో ఫోటో అందించాడు. ఆ ఫోటోలో వున్న భయంకరమైన వస్త్రుని చూసి ఆమె త్రుళ్ళిపడింది.

"అందమైన ఆడది బంగారు గుడ్లు పెట్టే బాతు లాంటిది. దాని అందంతో ఎంతైనా డబ్బు సంపాదించవచ్చు. కానీ తన అందంతో వ్యాపారం చేయడానికి ఆడది ఓ పట్టాన ఒప్పుకోదు. నాలాంటి వాడు రోజుల తరబడి చెప్పినా వినని ఆడదాన్ని క్షణాలమీద దేనికైనా ఒప్పించగల సమర్థత ఈ ఫోటోలోని మనిషికుంది. ఈ మనిషి పూర్తిగా నా చెప్పుచేతల్లో వున్నవాడు.

అయితే అందమైన ఆడవాళ్ళమీద మాత్రమే ఇతన్ని ప్రయోగిస్తాను. అదీ ఆ ఆడది నా మాట విననప్పుడు! అన్నట్లు... నువ్వు అందంగా వున్నావు. చాలా చాలా అందంగా ఉన్నావు.''

రవి మాటలు విని ఆమె బాగా కలవరపడింది. ఏమిటితని ఉద్దేశ్యం? తన్ను వ్యభిచారిణి చేస్తాడా? తలచుకుంటూనే ఒళ్ళు గగుర్పొడిచిందామెకు. రవి మళ్ళీ మొదలు పెట్టాడు.

''నీకంటె అందమైన ఆడదాన్ని నేను రెండు నెలల క్రితం వృత్తిలోకి దింపాను. అందుకే ఫోటో మనిషి అవసరమయ్యాడు. ఇప్పుడామె నాకు లక్షలు సంపాదించి పెడుతోంది. ఇంతకూ ఆమెను నీకంటె అందమైనదని ఎందుకన్నానో ఈ ఫోటో చూస్తే తెలుస్తుంది'' అంటూ ఆమెకింకో ఫోటో అందించాడతను.

ఆ ఫోటో అందుకుని చూసిన ఆమె ముఖంలో మొట్టమొదట సిగ్గు కనపడింది. తర్వాత అసహ్యం, ఆపైన ఆశ్చర్యం- ఆమీదట కోపం కనబడ్డాయి. రవి ఆమె ముఖ భావాలను చూస్తూ కూర్చున్నాడు. ఫోటోను పరిశీలించాక ఆమె రవి ముఖంలోకి ఒకసారి చూసి తల దించుకుంది. ఆ ఫోటో చూసేక అతని ముఖంలోకి చూడడం కష్టంగా వుందామెకు.

అందులో శ్యామసుందర్, స్నేహ అత్యంత అసహ్యకరమైన విధంగా వున్నారు. ఇద్దరి ముఖాలూ స్పష్టంగా కనపడుతున్నాయి. స్నేహ ఎవరో ఆమెకు తెలియదు. కానీ శ్యామసుందర్ మాత్రం...

''నువ్వుండగా నీ భర్త ఇంకో యువతి పొందు కోరు

తున్నాడంటే ఆమె నీకంటె అందమైనదేఅయుండాలి" అన్నాడు రవి. "అయినా వెరైటీ కోరే మగవాడికి అందంతో పనేమిటి?"

"ఈ ఫోటో నాకెందుకు చూపించినట్లు?" అందామె చివరకు.

"ఒకటి_ నిన్ను కూడా ఈ ఫోటోలోని ఆడదానిగా మార్చగలనని చెప్పడానికి. రెండు_ నీ భర్త నిజస్వరూపం కళ్ళారా చూసే అవకాశం నీకివ్వడానికి" అన్నాడు రవి తాపీగా.

"తర్వాత..." అందామె.

"నీ భర్తను బెదిరించడానికక్కర్లేదు వాలంటే ఈ ఫోటో నీకు వదిలేస్తాను ఒకే ఒక్క షరతుమీద" అన్నాడు రవి.

"ఏమిటా షరతు?"

"బంగారం పూత యంత్రం కావాలి. ఎలాగో అలా అది నువ్వు నీ భర్త దగ్గర్నుంచి సంపాదించి తెచ్చి నాకివ్వాలి" అన్నాడు రవి.

"లేకపోతే?"

"నీ కొడుక్కి స్వర్గలోకం. నువ్వు ఇహ లోకంలో రంభవు."

ఆమె ఆలోచనలో పడింది. రవి గురించి ఆమెకు చాలా భయంగా వుంది. భర్త ప్రవర్తన తెలిసేక అతని మీద విపరీతమైన కోపంగా వుందామెకు. ఈ రెండూ కలిసి ఆమె ఆలోచనలను రవికి అనుకూలంగా మారుస్తున్నాయి.

నిజానికి బంగారం పూత యంత్రం గురించి ఆమెకు తెలుసును. అది ఈ ఇంట్లోనే వుంది. చాలా కాలంగా

పూర్తి పనులు రహస్యంగా తనే చేస్తూంటుంది. కానీ తన మామగారు, భర్తకూడా అది వేరే ఎక్కడో ఉందన్న భ్రమ చాలామందికి కలిగించారు.

ఎంత మంది ఆ యంత్రం కోసం ప్రయత్నించి ఎలా భంగపడ్డదీ తన భర్త తన దగ్గర సగర్వంగా చెప్తూంటాడు. మూడోకంటివాడికి దాని ఉనికి గురించి తెలియడం ఇష్టంలేకనో_ దానికి సంబంధించిన వ్యవహారాలన్నీ ఇంట్లోవాళ్ళే చూసుకోవడం జరుగుతోంది.

దాని కారణంగా లక్షలార్జించే అవకాశముంది. అది లేకపోతే తమ వ్యాపారమే ఆగిపోతుంది. కానీ అదుంటే తన భర్తకు లక్షలు మిగలవచ్చు. కానీ తన జీవితం సర్వనాశనమవుతుంది.

క్రమంగా ఆమె ఆలోచనల్లో స్వార్థం చోటుచేసుకోసాగింది. డబ్బుకు తమకేమీ లోటులేదు. తన పేరనే బ్యాంకులో ఆరేడు లక్షలకుపైగా ఉన్నాయి.

గిల్టునగల వ్యాపారం ఆగిపోతే తనకేం? కొనసాగితే తనకేం? అవన్నీ తన భర్త చూసుకుంటాడు. ప్రవర్తన విషయంలో తనెలాగూ అతన్నదుపుచేయలేదు. అతని వ్యాపారం గురించి ఆలోచిస్తే బంగారంలాంటి తన బ్రతుకు సర్వనాశనమవుతుంది. తనుపోతే అతనింకో వివాహం చేసుకుని ఇంకా విచ్చలవిడిగా ఉంటాడు.

ఆమె ఆ యంత్రాన్నతని స్వాధీనం చేయాలని నిర్ణయించుకుంది.

12

శంకరం ముఖంలో ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది. "అద్భుతం! జీవితంలో ఇంత ఆనందం నాకెన్నడూ కలగలేదు" అన్నాడాయన.

నీరజ నిర్లిప్తంగా కూర్చుని ఉంది. ప్రతి పర్యాయమూ ఒక గండంలా ఉన్నదామెకు. ఇప్పటికి మూడు గండాలు గడిచాయి. ఇంక ఒకే ఒక్క గండముంది.

"మీ ఆఖరు పని చెప్పండి" అందామె.

"లలిత తెలుసా మీకు?" అన్నాడు శంకరం తన మామూలు ధోరణిలో.

"తెలియదు."

"అవున్లేండి. ఎలా తెలుస్తుంది? ఆమెగురించి చాలా మందికి తెలియదు" అన్నాడు శంకరం.

"ఎవరామె?"

"ఈ ఊళ్ళోనే వుంటోంది. ఒక ప్రయివేట్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తోంది. చాలా అందంగా వుంటుంది. అందానికి మించిన తెలివితేటలు."

"అలాంటి ఆడవాళ్ళు చాలామంది ఉంటారు. ఆమె ప్రత్యేకత ఏమిటి?" అంది నీరజ.

"మీకర్థమయ్యేలా చెప్పాలంటే ఆమె ఆడ రవి!" అన్నాడు శంకరం.

నీరజ కర్థంకాలేదు. "అంటే?" అంది.

"మగవాళ్ళలో రవికెన్ని క్వాలిటీస్ వున్నాయో, ఆడవాళ్ళలో ఆమెకూ అన్ని క్వాలిటీస్ వున్నాయి. ఆమెకోసం నేను ఎన్నో రకాల ప్రయత్నించాను. అన్ని ప్రయత్నాలు ఫెయిలైపోయాయి. ఏమీ చేయలేక పోయాను. మామూలు ఎత్తులకు, జిత్తులకు లొంగదామె. బలప్రయోగంకూడా పనిచేయలేదు. కండలు తిరిగిన వస్తాదులనే మన్ను కరిపించిందామె. కరాటేలో శిక్షణ పొందిందామె."

"ఇప్పుడు రవి ఏం చేయాలి?"

"ఆమెను నా మనిషిని చేయాలి."

"అంటే?"

"ఆమెను నా కప్పగించాలి. ఆమె నేను చెప్పే మాటలు వినేలా చేయాలి."

"అదెలా సాధ్యం? ఏదైనా వస్తువును సాధించవచ్చు గానీ మనిషి మనసును సాధించడమెలా? అది మీవల్లనే కావాలి" అంది నీరజ.

"నావల్ల కాలేదు. కనుకనే మీ దగ్గరకు వచ్చాను. ఇది నేను మిమ్మల్ని కోరుతున్న ఆఖరు కోరిక. ఇది సాధ్యపడితే నేనింక మీ జోలికి రాను. హాయిగా, సంతోషంగా సుఖజీవనం చేయవచ్చు మీరు" అన్నాడు రవి.

"కానీ ఇది చాలా అన్యాయం. ఒక మనిషిని ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా ఇంకొకరి పాలేయడమే నా కిష్టంలేదు. ఇష్టం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో అది చేయవచ్చు. అయితే ఆ మనిషిని మానసికంగా మీ పరం చేయడం మీవల్లకాదు."

"వల్లకాదంటే కుదరదు. శాయశక్తులా ప్రయత్నించాలి" అని శంకరం అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయాడు.

నీరజ నిరుత్సాహంగా అక్కడే కూర్చుండిపోయింది. ఈ పని సాధ్యపడుతుందని ఆమెకు అనిపించడంలేదు. శంకరం లలితకోసం చాలా ప్రయత్నాలుచేసి ఉండాలి. ఆమె కోరకరాని కొయ్య అన్నది స్పష్టమైనాకనే-నిరాశ చేసుకుని ఉంటాడు. ఇప్పుడు రవికీ పని అంటగట్టాడు. ఇంతవరకూ భగవత్ కృపవల్ల అన్నీ సక్రమంగా అయిపోయాయి. చివరకు ఇబ్బంది తప్పేలా లేదు.

'భగవాన్_మా ప్రేమ ఫలిస్తుందా? మేము కూడా అందరిలాగే హాయిగా కాపురం చేసుకునే రోజు అసలు రానున్నదా?' అనుకుంది నీరజ.

13

"ఇది మన ప్రేమకు ఆఖరి సవాలు" అంది నీరజ.

"అని నువ్వనుకుంటున్నావా?" ఏదో ఆలోచిస్తూ అన్నాడు రవి.

"రవీ__నిన్ను చూస్తే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఒక్కోసారి మన ప్రేమజీవితం ఎలాగుంటుందోనని కూడా భయంగా ఉంటుంది. ప్రతి విషయంలోనూ నీ ప్రవర్తన సూటిగా ఉంటుందో కానీ లోతుగా ఉండడం లేదు. నేను చెప్పిన పనులన్నీ సాధించుకువస్తున్నావు తప్పితే కారణాలగురించి నన్నెక్కువగా వేధించడంలేదు నువ్వు. ఏ విషయాన్నయినా నీకు సంబధించినంతవరకే తప్ప పట్టించుకోవడంలేదు."

నీరజ మాటలకు రవి నవ్వాడు. "నువ్వలా ఎందుకనుకుంటున్నావో నే నర్థం చేసుకోగలను. నేరాలతో నా హృదయం కరడుగట్టుకుపోయింది. నీ ప్రేమలో అది కరగడం ఆరంభమయింది. అయితే కొన్ని ప్రయోజనాలు కోరావు నువ్వు. అవి సాధించాలంటే ప్రేమ ప్రభావానికి దూరంగా ఉండాలి నేను. నా ప్రేమ రీతులు నీకు ముందుముందెలాగూ తెలుస్తాయి.

ఇంతవరకూ నీకోసం నేను సాధించిన విషయాల కెంత అవగాహన అవసరమో నీకు తెలుసా? ఈ నగరంలో ప్రముఖులందరి రహాస్యాలూ, బలహీనతలూ నాకు తెలుసును.

పది నిముషాలు మాట్లాడితే ఎదుటివాడి మన స్తత్వా న్నాకళింపు చేసుకోగలను నేను. అందుకే షాజహాన్ నన్ను వదులుకోవడానికిష్టపడలేదు. నేను సాధించిన పనుల వెనకనున్న లోతైన మన స్తత్వ పరిశీలన నువ్వు గుర్తించి ఉంటే ఈ మాట అని ఉండేదానివి కాదు నువ్వు."

"సారీ రవీ—నా మాటలతో నిన్ను బాధపెట్టినట్లున్నాను!" అంది నీరజ.

"ఏమీ లేదు. నా దృష్టిలో నువ్వింకా పసిపాపవు. నిన్ను కొంతకాలం ప్రేమతో లాలించాలి. ఆ తర్వాత నువ్వే తల్లివౌతావు."

నీరజ సిగ్గుపడింది. అంతలోనే ఆమెకు శంకరం ఆఖరి కోరిక గుర్తొచ్చింది. "కానీ లలిత మనసు నువ్వు సాధించ గలవా?" అంది నిరుత్సాహంగా.

"అన్నింట్లోకీ అదే నాకు సులభం" అన్నాడు రవి.

"ఎలా?" అంది నీరజ ఆశ్చర్యానికి సంతోషం జత కాగా.

"ఎలాగని అడగవద్దు. ఇంకో గంటలో నేను లలితను తీసుకుని నీ దగ్గరకు వస్తాను. ఆ తర్వాత మనం మంచి ముహూర్తం చూసుకోవాలి" అన్నాడు రవి.

14

"హల్లో లలితా_ నీతో ఒక చిన్న పని తగిలింది."

"వ్వాట్ డియర్" అంది లలిత.

"నన్నలా పిలవద్దని చెప్పానా?"

"పిలుస్తేగా_ అంతకుమించి ఎలాగూ సాధ్యపడను నాకు."

"కాదు లలితా, నా వివాహం నిర్ణయమైనట్లే!" అన్నాడు రవి.

పక్కలో బాంబు పడ్డట్టదిరిపడింది లలిత. "ఏమిటన్నావ్?"

"నేనొక అమ్మాయిని ప్రేమించాను. ఆమెకూడా నన్ను ప్రేమించింది. ఇద్దరం పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. చిన్న అడ్డంకి వచ్చింది."

"ఏమిటది?"

"అదేమైనప్పటికీ నువ్వు సాయంచేస్తేనే ఆ అడ్డు తీరుతుంది...

"చెప్పు...."

"లలితా! నువ్వు నన్ను ప్రేమించావు. నేను నిన్ను అభిమానిస్తున్నాను గానీ నువ్వు కోరేవిధంగా ప్రేమించలేకపోతున్నాను. అది నా దురదృష్టం. కానీ ఎన్నో పర్యాయాలు నిన్ను నేను కాపాడాను. ఒకటి రెండు పర్యాయాలు నువ్వు నన్ను కాపాడావు. జీవితంలో నా కోసం ఏమైనా చేయగలనని చెప్పావు. అందుకు కారణం ప్రేమ అని కూడా చెప్పావు. అందుకే ఇప్పుడు గంపెడాశతో నీ దగ్గరకు వచ్చాను. నాకోసం ఏమైనా చేసి నీ ప్రియుడి ప్రేమను భగ్నంకాకుండా కాపాడగలవా?" అన్నాడు రవి.

"అందుకు సందేహమా?" అంది లలిత.

"అయితే నేను నిన్ను నాకాబోయే భార్య నీరజకు అప్పగిస్తాను. ఆమె నిన్ను ఒక పురుషుడికి అప్పగిస్తుంది. నువ్వు పూర్తిగా అతని అధీనంలోకి వెళ్ళిపోవాలి. అతను నిన్ను బాధించడు, హింసించడు. అపురూపంగా చూసు

కుంటాడు. అలా చూసుకోకపోతే నువ్వతని అధీనంలో ఉండనవసరంలేదు.''

"రవీ! ఏమిటి నువ్వనేది?'' అంది లలిత. ఆమె కన్నులలో నీరు తిరిగింది.

"చాలా స్పష్టంగా చెప్పాను లలితా'' అన్నాడు రవి.

"అవును నిజమే. కానీ నా ప్రేమకిదా ప్రతిఫలం? నిన్ను ప్రేమించిన తప్పుకి ముక్కూ ముఖం ఎరుగని మగవాడికి స్వాధీనమైపోవాలా? నా అన్నవారు లేని నాకు నువ్వైనా వున్నావనుకున్నాను. కానీ నీ కడుపులో నా గురించి ఇలాంటి ఊహలున్నాయనుకోలేదు'' అంది. చాలా బాధగా వచ్చాయీమాటలామె నోటివెంట.

"మామూలు ఆడదానికిలా మాట్లాడకు లలితా! నన్ను ప్రేమించిన తప్పు అంటున్నావు. అంటే నన్ను ప్రేమించడం ద్వారా తప్పు చేశానని అనుకుంటున్నావా? నా మీద ఎంతో విశ్వాసమున్న నీవు- నేను నీకు సరైన వరుణ్ని చూడననుకుంటున్నావా? నీకూ నాకూ వివాహం కానంతమాత్రాన నా ప్రేమ భగ్నమైపోవాలా? ఇదేనా నీ ప్రేమ?'' అన్నాడు రవి.

లలిత- అతను అలాగే అయిదునిమిషాలసేపు వాదించుకున్నారు. రవి తర్కంముందు లలిత నిలబడలేకపోయింది. "సరే పద రవీ. నీ సంతోషంకోసం నేను త్యాగం చేస్తాను....'' అందామె.

15

"నేనెవరో నీకు తెలుసా మిస్టర్ రవీ!'' అన్నాడు వీరభద్రం.

"తెలుసు. మీరు నీరజకు తండ్రి'' అన్నాడు రవి.

"నీరజకు సంబంధించినంతవరకూ తండ్రినే. కానీ నీకు సంబంధించినంత వరకూ యముణ్ణి...." అన్నాడు వీరభద్రం.

"నేను యముడికి భయపడే రకంకాదు. షాజహాన్ తెలుసా మీకు?" అన్నాడు రవి.

వీరభద్రం మాట్లాడకుండా ఒక్క నిముషం వూరుకుని తర్వాత "తెలుసు ఏం?"

"అతనుకూడా నాకు భయపడతాడు."

వీరభద్రం తడబడ్డాడు. తర్వాత తమాయించుకుని "ఇలాంటి కబుర్లు చాలా విన్నాం. నువ్వు మాత్రం నీరజ జోలికి రాకు" అన్నాడు.

సమాధానంగా "నీరజా!" అన్నాడు రవి. వీరభద్రం ఆశ్చర్యంగా చూస్తూండగా గదిలోకి నీరజ వచ్చింది.

"అయితే అమ్మాయిని బయట నిలబెట్టి నువ్వు లోపలకు పెళ్ళిమాటలకు వచ్చావన్నమాట" అన్నాడు వీరభద్రం కోపంగా.

"నీరజా! మీ నాన్నగారికి నీ నిర్ణయం తెలియజెయ్యి" అన్నాడు రవి.

"నాన్నా నేనితన్ని ప్రేమిస్తున్నాను. మా ఇద్దరికీ మీరు వివాహం జరిపిస్తే సరేసరి. లేదా మేము రిజిస్ట్రాఫీసులో పెళ్ళి చేసేసుకుంటాం. ప్రస్తుతం ఇద్దరం హోటల్ శాంతినివాస్ లో పదకొండో నెంబర్ గదిలో ఉంటున్నాం. సాయంత్రలోగా మీ నిర్ణయం మాకు తెలియజేయండి" అంది నీరజ.

నీరజ తండ్రి ఎదుటపడి ఎన్నడూ అలా మాట్లాడలేదు. వీరభద్రం ఆమె మాటలకు మ్రాన్పడిపోయాడు.

ఆయన తేరుకునేలోగా ప్రేమికులిద్దరూ వీధిలోకి వెళ్ళి పోయారు.

“ఎంత ధైర్యంగా మాట్లాడావు నీరజా...” అంటూ అభినందించాడు రవి.

“ఈ ప్రపంచంలో ఏమైనా సాధించగల భర్త నీవుండగా నాకింకెవరన్నా భయం పోయి ఓ కొత్త ధైర్యం నన్నావహించింది” అంది నీరజ.

“కీ పిటప్....” అన్నాడు రవి.

“అన్నట్లు చెప్పడం మరిచిపోయాను రవీ. శంకరానికి లలితను అప్పగించేక ఆయన నాకో ఉచిత సలాహా పారేశాడు. నువ్వు చేసిన పనులవల్ల షాజహాన్‌కు చాలా నష్టం వాటిల్లిందట. అతను నీమీద పగబట్టవచ్చునట. మన మార్గం నిష్కంటకం కావాలంటే షాజహాన్ని చంపేయడం మంచి మార్గమన్నాడాయన...” అంది నీరజ.

ఆమె మాటలు వింటూ రవి క్షణంపాటు ఏదో ఆలోచించి “నాతోరా నీరజా ఇది జరిగింది నిన్నకదా ఈ రోజు నిన్ను షాజహాన్ దగ్గరికి తీసుకువెళ్ళాలి...” అన్నాడు.

“ఎందుకు?”

“షాజహాన్ నా మేలుకోరే వ్యక్తి. అతను నాకెన్నడూ అపకారం తలపెట్టడు. నావల్ల అతనికి అపకారం జరిగిందని నువ్వంటూంటే నాకు చాలా బాధగా వుంది. అదే నిజమైతే నేను తల బద్దలుకొట్టుకు చచ్చిపోతాను. షాజహాన్‌కు నిన్ను చూపిస్తాను. జరిగినదంతా చెబుతాను నేను కావాలని, తెలిసి అతనికి నష్టం కలిగించాలని ప్రయత్నించలేదని చెబుతాను. అతను నమ్మి నన్ను మన్ని

స్తేనే మన జీవితం కొనసాగుతుంది. లేకపోతే నేనుండను. నువ్వే వుంటావు!''

నీరజ మాట్లాడలేదు. షాజహాన్ అంటే రవికి చాలా అభిమానమని ఆమెకు తెలుసును కానీ మరీ ఇంత ఎక్కువగా అది వుందని ఆమెకు తెలియలేదు.

ఇద్దరూ టాక్సీ ఎక్కారు. రవి చెప్పిన ప్రకారం టాక్సీ సత్యప్రకాష్ హోటల్ వద్ద ఆగింది. ఇద్దరూ టాక్సీ దిగారు.

''షాజహాన్ పనులు ఎక్కువగా అతని అనుచరులే చేస్తూంటారు. అతను కొన్ని ముఖ్యమైన వాటిలోనే జోక్యం చేసుకుంటాడు. అయినప్పటికీ అతనికి కొన్ని నిర్ణీత సమయాలూ, నిర్ణీత స్థలాలూ ఉన్నాయి. ఉదాహరణకు ఈ రోజు సోమవారం కదా. ఈ రోజు ఈ సమయంలో అతను సత్యప్రకాష్ హోటల్లో ఏడో నంబరు గదిలో వుంటాడు...'' అన్నాడు రవి.

అయితే రవి అంచనా తప్పయింది. రిసెప్షన్ కౌంటర్లో చెప్పిన ప్రకారం ఏడో నెంబర్ గదిలో ఎవరూ లేరు. అది ఖాళీగావుందిట. నిరుత్సాహంగా ముఖం పెట్టిన రవిని—
''ఆర్ యూ మిస్టర్ రవీ!'' అనడిగాడు రిసెప్షనిస్ట్.

రవి తల ఊపాడు.

''ఏడోనంబర్ గదిలోని తనకోసం వచ్చిన రవి అనే అతనికివ్వమని ఒక కవరిచ్చాడతను...'' అంటూ రవికి కవరు అందించాడు రిసెప్షనిస్టు.

అది తీసుకుని ఆక్రమించి బయటపడ్డాడు రవి. నీరజ అతన్ననుసరించింది. ఇద్దరూ శాంతినివాస్ హోటల్లో పదకొండో నంబర్ గదికి వెళ్ళారు.

రవి తిన్నగా బాత్రూంలోకి వెళ్ళాడు. అక్కడ సింకునిండా నీళ్ళుపట్టాడు. తన జేబులోంచి ఒక చిన్న సీసాతీసి అందులోని పొడిని కొద్దిగా నీటిలో వేశాడు. తర్వాత సీసాను జేబులో వేసుకున్నాడు. నీటిని బాగా చిలకరించి అందులో కవరు పడేశాడు. బాగా నీటిని పీల్చేలా దాన్ని అంగులో కదిపాడు. తర్వాత కవరు తీశాడు.

దానిమీద "ఫ్రం షాజహాన్" అని వుంది. పక్కనే ఉన్న నీరజకు అది చూపించి "ఈ ట్రీట్‌మెంట్‌వల్ల కవరుమీద చిరునామా కనబడుతుంది. కవర్లోని తెల్ల కాగితాలమీద అక్షరాలు పుడతాయి. ఇది మా సీక్రెట్ పద్ధతి!" అన్నాడు.

నీరజ ఆశ్చర్యంగా అతని మాటలు విని, చేష్టలు చూస్తోంది.

కవరు తెరిచాడు రవి. కాస్త పెద్ద ఉత్తరమే ఉంది. అందులోని వివరాలు చదివి రవి, నీరజ కూడా ఆశ్చర్య పడ్డారు. షాజహాన్ రాసిన ఆ పెద్ద ఉత్తరంలోని ముఖ్య వివరాలివి:

షాజహాన్ లలితను ప్రేమించాడు. ఆమెను తన మతాలో జేర్చుకుందామనుకున్నాడు. ఆమె సాయంతో పెద్దఎత్తున నేరాలు చేయాలనుకున్నాడు. నేరాలకూ లలిత మన స్తత్వానికీ సరిపడదని అతనికి తెలిసింది. నయానా భయానా ఆమె తనకు లొంగదని కూడా తెలిసి పోయింది.

లలితకోసం అతను తన జీవనపధాన్ని మార్చుకో వాలనుకున్నాడు. మామూలు మనిషిగా మారాలను

కున్నాడు. ఆ సమయంలో నే లలిత రవిని ప్రేమిస్తోందనీ, రవి, నీరజను ప్రేమిస్తున్నాడనీ __ లలిత, నీరజ రవికోసం ఏమైనా చేయగలరనీ అతను గ్రహించాడు. తను మామూలు మనిషిగా మారడానికి రవిచేత కొన్ని పనులు చేయించాలని అతననుకున్నాడు.

కానీ అప్పటికి రవి మనసు షాజహాన్ అధీనంలోంచి తప్పిపోయింది. ఏంచేయాలో తెలియక సతమతమైపోయిన షాజహాన్ చివరకు రవిని బెదిరించాడు. మొండిఘటం రవి బెదరలేదు. అప్పుడు షాజహాన్ శంకరం అవతార మెత్తి నీరజను బెదిరించి, రవిద్వారా తనకు కావలసిన వన్నీ సాధించుకున్నాడు.

అతను ఇప్పుడు నా త్రిండియా వెళ్ళిపోయి సామాన్య జీవితం ప్రారంభించదల్చుకున్నాడు. ఇంక అతను రవికి కనిపించడు.

"రవీ! నీరజపై నీకున్న ప్రేమ అపూర్వం. ఆ ప్రేమను నా ప్రేమకోసం ఉపయోగించుకున్నాను. నేను కోరిన వన్నీ సాధించడంద్వారా నీ గురించి నాకూ రెండు విష యాలు తెలిశాయి. అన్నివిధాలా నువ్వు నాకంటె సమర్థుడివి. నేను నీకు బాస్ గా వుండటానికి తగను. ఇది నేను తెలుసుకున్న మొదటి విషయం. ఏ పరిస్థితిల్లోనూ నువ్వు నన్ను మోసం చేయవు. నాకు అపకారం తలపెట్టవు. నీవంటి వాడిని అనుచరుడిగా పొందడం నా అదృష్టం. ఇంకా నిన్ను అనుచరుడి స్థాయిలో వుంచడం నా తప్పు కూడా. ఇది నేను తెలుసుకున్న రెండవ విషయం. జీవితంలో మరెన్నడూ నేరాల జోలికి పోకు. హాయిగా జీవితం వెళ్ళబుచ్చు. నీకూ నీరజకూ నా శుభాకాంక్షలు" అంటూ ముగించాడు షాజహాన్ ఆ ఉత్తరాన్ని.

"నీద్వారా నేను షాజహాన్ నుపయోగపడుతున్నా నన్న అనుమానం నాకుంది. అయితే ఆ శంకరం షాజహాన్ ని చంపమని సలహాఇచ్చాడం టేమాత్రం కలవరపడి విషయం తెలుసుకోవాలనుకున్నాను..." అన్నాడు రవి. ఒక్క క్షణం ఆగి "నీరజా షాజహాన్ నాకంటె సమర్థుడో కాదో నాకు తెలియదు. కానీ అతను నాకు బాస్ గా ఉండతగ్గవాడు. నాలాంటి వాణ్ణెలా ఉపయోగించుకో వాలో అతనికి బాగా తెలుసు" అన్నాడు రవి.

"నీలాంటి వాణ్ణెలా ఉపయోగించుకోవాలో నాకు బాగా తెలుసు..." అంది నీరజ నవ్వి.

"అవున్లే షాజహాన్ వెళ్ళిపోయినా నా ఉద్యోగం మాత్రం మారలేదు. అప్పుడతని అనుచరుడిని. ఇప్పుడు నీ అనుచరుడిని..." అన్నాడు రవి.

అప్పుడే ఎవరో తలుపు తట్టారు. నీరజ వెళ్ళి తలుపు తీసింది.

నీరజ తండ్రి వీరభద్రం నవ్వుతూ లోపలకు వచ్చాడు.

-: ఐ పో యిం ది :-